TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND GUNTUR

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 198 బుధవారం, జూన్ 03, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు

అత్యుత్తమమైన సేవలు,

ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.

జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు
- అత్యవసర & క్రిటికల్ కేర్
- ప్రమాద సేవలు
- ప్రసూతి & గైనకాలజీ
- ఆర్థోపెడిక్స్
- జాయింట్ రీప్లేస్‌మెంట్స్
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ
- మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
- పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
- న్యూరాలజీ • న్యూరోసర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
- యూరాలజీ • డెర్మటాలజీ
- సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ

అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్

+91 85230 89599 +91 86889 09384

www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

# రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యం

## ప్రజలకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ స్వరాష్ట్ర అస్తిత్వం కోసం దశాబ్దాల ఉద్యమంలో ఎందరో అమరులయ్యారు. మరెందరో పోరాట యోధులుగా నిలిచారు. వారి త్యాగాలకు, తెగువకు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

మంగళవారం నాడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో అయన మాట్లాడుతూ. కోటి రతనాల వీణ.. నా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతి ఏటా త్యాగాల చరిత్రను స్మరిస్తూ, రేపటి భవిష్యత్ కు దిశానిర్దేశం చేసుకునే ఒక భావోద్వేగ సందర్భం జూన్ 2 మనం కలలు కన్న స్వరాష్ట్ర స్వప్నాన్ని నిజం చేసిన ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, నాటి యు.పి.ఏ ఛైర్ పర్సన్ సోనియాగాంధీలకు తెలంగాణ సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

పుట్టుక నీది... చావు నీది, బతుకంతా దేశానిది" అన్న ప్రజా కవి కాళోజీ మాటలే స్ఫూర్తిగా డిసెంబర్ 7, 2023 న బాధ్యతలు స్వీకరించిన క్షణం నుండి ప్రతిక్షణం తెలంగాణ హితమే పరమార్ధంగా, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. రాష్ట్రంలో అధికారం ఇవ్వడంతో పాటు, ఈ రెండున్నరేళ్లలో జరిగిన పలు ఉప ఎన్నికల్లో, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మా పట్ల మీరు చూపించిన ఆదరణ, అభిమానం మరువలేనిది. ఎవరెన్ని విమర్శలు, కుట్రలు చేసినా ప్రజలు మాకు అండగా నిలవడం ఎనలేని శక్తిని ఇచ్చింది. ప్రజల సంక్షేమం పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల మా బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. రైతులు, యువత, ఆడబిడ్డల ఆకాంక్షలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద వర్గాల సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధన కోసం పలు విధాన నిర్ణయాలు తీసుకుంటూ, కార్యాచరణ చేసుకుంటూ రెండున్నరేళ్లుగా నిరంతరం శ్రమిస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమపాళ్లలో ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నాం. ఈ రోజు నేను గర్వంగా చెప్పగలను... దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో మనం అమలు చేస్తున్నాం.

అభివృద్ధి, సంక్షేమం ఒక ఎత్తు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం మరో ఎత్తు. తెలంగాణ ఆవిర్భావం ఒక ప్రత్యేక ఘట్టం. దశాబ్దాలు ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నది కేవలం సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం ఈ గడ్డపై ప్రతి బిడ్డ పోరాటం చేశారు. పెత్తందారీ తనానికి వ్యతిరేకంగానే పోరాటాలు జరిగాయని అన్నారు.

నాటి రాచరికం నుంచి నిన్నటి నియంతృత్వం వరకు తెలంగాణ తిరుగుబాటు చరిత్ర మొత్తం చెబుతున్న సత్యం ఇదే. ఆ చరిత్రకు మనం సాక్షులం. రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి కొత్త చరిత్రను రాసుకోవడం కోసం మీరు ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ఈ రోజు ప్రజల మనోభావాలకు మేం ప్రతినిధులం. సమాజ ఆకాంక్షలకు మేం వారధులం. అందుకే మీరిచ్చిన ఈ అవకాశాన్ని మేం అధికారం.. అని సంభోదించడం లేదు. మమ్మల్ని మేం పాలకులుగా అనుకోవడం లేదు. మీకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం. ప్రభుత్వం అంటే నలుగురు చేతుల్లో పెత్తనం కాదు... నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ప్రతినిధి.. అని మేం భావిస్తున్నాం... బాధ్యతగా పని చేస్తున్నాం. అందుకే ఇది కేవలం పరిపాలన చేసే ప్రభుత్వం కాదు... ప్రజాస్వామ్య ఆకాంక్షలను నెరవేర్చే ప్రజా ప్రభుత్వం అని గర్వంగా చెబుతున్నామన్నారు.

డిసెంబర్ 7, 2023న ప్రారంభమైన మన ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడానికి ప్రాధాన్యతనిస్తూ వస్తోంది. రకరకాల అడ్డంకులు అధిగమిస్తూ 30 నెలల్లోనే ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

## తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందాం: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



హైదరాబాద్, జూన్ 02: తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007-08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు.తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యాని ంచారు. వైసీపీ తనను ఆంధ్ర ప్రదేశ్‌లో అడుగుపెట్టనివ్వనంటే ఈ ప్రాంతం ఆదరించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు .ఆంధ్రప్రదేశ్‌లోనే తాను అధికారం కోరుకోలేదన్నారు. అలాంటిది తెలంగాణలో ఎందుకు కోరుకుం టానని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు, నాయకులకు ఆంధ్రప్రదేశ్‌పై విద్వేషం లేదన్నారు. విద్వేషం చూపించి ఉంటే ఆ రాష్ట్ర ప్రజలు ఇక్కడ తిరిగేవారు కాదని పేర్కొన్నారు.హైదరాబాద్‌లో తనకేం పని కొందరు ప్రశ్నిస్తున్నారన్నారు. మీరు ఎవరు తనను బెదిరి ంచడానికి అని ప్రశ్నించారు. తెలం గాణ మీ అయ్య జాగీరా అని వారిని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ నిలదీశారు. తనపై దాడులు చేస్తామంటున్నారన్నారు. తనకు తెలంగాణలో కంటే ఏపీలోనే బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెప్పారు. 2019 తాను ఓడిపోయినప్పుడు.. తెలంగాణ వాసులే.. ఇక్కడ ఆ పరిస్థితి రాదన్నారని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు.మీ ఇష్టానికి మాట్లాడితే మేం భయపడాలా? అని ప్రశ్నించారు. తెలంగాణలో జనసేన ఎదగాలని ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. మీరు ఎన్ని తిట్లు తిట్టినా.. తన గుండెలో తెలంగాణ ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ గూండాల బెదిరింపుల ముందు ఈ బెదిరింపులు ఓ లెక్కా? అని అన్నారు.ఓ విశ్లేషకుడు ఇక్కడ తన గురించి తప్పుగా మాట్లాడారని తెలిపారు. ఆ విశ్లేషకుడి వల్లే ఈ గొడవ మొదలైందన్నారు. ఆ వ్యాఖ్యలపైనే జనసేన సైనికులు స్పందించారని వివరించారు. కొన్ని చోట్ల కేసులు పెట్టారు.. అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంకా మేం నోరు మూసుకుని కూర్చోవాలా అంటూ అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో మార్పు తప్ప మేం అధికారం కోరుకోవడం లేదని పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. వాళ్లను అక్కడి నుంచి వెళ్లిపోమనడం కరెక్టేనాఅని ప్రశ్నించారు.

## 2028 డిసెంబర్‌లో మళ్లీ సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం: కేటీఆర్



హైదరాబాద్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో అమరవీరులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఆపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల పాలైందని వ్యాఖ్యానించారు. లివింగ్ లెజెండ్ కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ వచ్చాక నోరుందని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'ఎత్తిన జెండా దించనని.. జెండా దించితే రాళ్లతో కొట్టిచంపమని అన్న ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్' అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. నెత్తురు పారిన చోట సాగు నీళ్లు తీసుకువచ్చింది కేసీఆర్ అని తెలిపారు. లక్షా 65 వేల ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ అని.. అల్పకులు ఏది పడితే అది మాట్లాడతారని మండిపడ్డారు. దేశమంతా కాంగ్రెస్‌ను వదిలించుకుందన్నారు. తెలంగాణను కాంగ్రెస్.. కుక్కలు చింపిన విస్తరిలా చేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులు.. అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితి వచ్చిందన్నారు. కృష్ణా, గోదావరిని గురువుకు గురుదక్షిణగా రేవంత్ ఇస్తున్నారని ఆరోపించారు. 'రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ వచ్చి చెప్పిన 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ? సెక్యూరిటీ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బయటికి వస్తారా.? రైతుబంధు లేదు.. కానీ రాహుల్ గాంధీ బంధు టింగ్ టింగ్ అని వెళ్తోంది. తెలంగాణ తల్లి ఒడ్డాణం, కిరీటం ఎత్తుకుపోతున్నారు' అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## ఓటురు జాబితా సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి: సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్, జూన్ 2: 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి డీజీపీ సీవీ ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభల్లో పంటల వైవిధ్యీకరణపై రైతులకు సూచనలు చేయాలన్నారు. వర్షాకాల సన్నద్ధతపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.నీటి నిల్వల నివారణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ తెలిపారు. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ(రాఊఉ) సభ్యుల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్లకు సీఎస్ రామకృష్ణారావు సూచనలు చేశారు.



## మిలియన్ మార్చ్‌ను తలపించేలా భూపోరాటం: కవిత

హైదరాబాద్: మిలియన్ మార్చ్‌ను తలపించేలా భూపోరాటం చేస్తామని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జులై 2న ఉప్పల్ భగాయత్‌లో పెద్దఎత్తున భూపోరాటం చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో కవిత పాల్గొని.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ఇప్పటివరకు సీఎం నుంచి ప్రకటన రాలేదన్నారు. ఆగస్టు 6వ తేదీ లోపు ట్యాంక్‌బండ్‌పై జయశంకర్ విగ్రహం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.



**ఆంధ్ర ప్రజలకు మేం వ్యతిరేకం కాదు: కోదండరాం :** తెలంగాణ జనసమితి కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. 60 ఏళ్ల నిరీక్షణ ఫలించిన రోజు జూన్ 2 అని అన్నారు. ఆంధ్ర ప్రజలకు తామెప్పుడూ వ్యతిరేకం కాదని, తెలంగాణపై ఆంధ్ర పాలకుల పెత్తనాన్ని మాత్రమే వ్యతిరేకించామని చెప్పారు. తెలంగాణ కోసం సోనియాగాంధీ, సుష్మాస్వరాజ్ కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరితో వ్యవహరించిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛ వచ్చిందని అన్నారు.

## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పోటీయే లేదు: భట్టి విక్రమార్క



ఖమ్మం: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై మీడియా దృష్టి పెట్టాలని.. ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రతి ఒక్కరూ సర్ మ్యాపింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణ అవతరణ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులే లేరని వ్యాఖ్యానించారు. "రైతు వ్యతిరేక పార్టీ భాజపానే. పని చేసే పార్టీలకు ప్రచారం అవసరం లేదు. అసెంబ్లీ, ఎంపీ, మున్సిపల్ ఎన్నికల్లో మా సత్తా చూపించాం. జిల్లా పరిషత్ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# సంపాదకీయం

బుధవారం, జూన్ 03, 2026

## భారీగా తగ్గిన బంగారం కొనుగోళ్లు...

ప్రధాని నరేంద్ర మోదీ కొద్ది రోజుల కిందట విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు కీలక సూచనలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులోనే బంగారం కొనుగోళ్లకు సంబంధించింది ఒకటి ఉంది. భారతీయులు బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు నిలిపివేయాలని.. పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నా కొనబోమని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. అయితే ఈ క్రమంలోనే పసిడి కొనుగోలుదారులు ట్రెండ్ మార్చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించేసింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన, ఆహార ధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70 శాతం మేర పడిపోయింది.బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం 6 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 శాతం నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం కావడం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని 'ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్' వెల్లడించింది. గతేడాది మే నెల చివరి రెండు వారాల్లో 25 టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65 శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ఈ నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితమైంది. ఈ ఏడాది బంగారానికి దూరంగా ఉండాలంటూ ప్రధానమంత్రి మోదీ దేశ ప్రజలకు చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితో పాటు పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నాయి. ప్రస్తుతం ముంబై స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1.57 లక్షలు పలుకుతుండటం గమనార్హం.బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో కొనుగోలుదారులు తమ బడ్జెట్‌కు తగ్గట్టుగా తక్కువ క్యారెట్ ఉన్న లైట్‌వెయిట్ నగల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకొని చేతిలో డబ్బుల కోసం తమ పాత నగలను అమ్మి క్యాష్ చేసుకునేందుకు జనం జువెలరీ షాపుల వద్ద క్యూ కడుతున్నారు.భారతీయులకు బంగారం అంటే విపరీతమైన ఇష్టం ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఎక్కువగా మహిళలు.. పండగలు, పెళ్లిళ్లు సహా ఇతర శుభకార్యాల వేళ బంగారు ఆభరణాల్ని ఎక్కువగా కొనుగోలు చేసి ధరించాలని చూస్తుంటారు. అయితే.. గత కొంత కాలంగా దీనికి డిమాండ్ తగ్గింది. బంగారం ధరలు ఈ కాలంలో విపరీతంగా పెరగడమే ఇందుకు కారణం. గతేడాది గోల్డ్ రేట్లు ఏకంగా 70 శాతానికిపైగా పెరిగాయి. ఇదే సమయంలో ఈ ఏడాది కూడా ఆరంభంలో పెరిగినా.. తర్వాత అమెరికా- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో స్వల్పంగా తగ్గాయి. అయినప్పటికీ మరీ ఎక్కువేం తగ్గలేదు. దీంతో ఇప్పటికీ గరిష్ఠ స్థాయిల్లోనే కొనసాగుతున్నాయి.ఇక భారత ప్రధాని నరేంద్ర మోదీ కొద్ది రోజుల కిందట బంగారం కొనుగోళ్లకు సంబంధించి ఒక కీలక ప్రకటన చేశారు. విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుందని.. దీనిని ఆదా చేసేందుకు బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు నిలిపివేయాలని.. పండగలు, ఇతర శుభకార్యాలు ఉన్నా కూడా పసిడి కొనుగోళ్లను వాయిదా వేయాలని సూచించారు. భారతీయులు.. బంగారానికి సంబంధించి ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతుంది కాబట్టి.. దిగుమతి బిల్లు పెరిగి విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుందని అన్నారు.అయితే మరి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు తర్వాత భారతీయులు.. బంగారం కొనుగోళ్లను తగ్గించారా అంటే.. అలా జరగకున్నా ట్రెండ్ మార్చేశారని తెలుస్తోంది. పసిడి కొనుగోళ్లకు సంబంధించి.. వినియోగదారుల ధోరణిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని తెలుస్తోంది. గతంలో కొత్త ఆభరణాల్ని కొనుగోలు చేసేందుకు పూర్తి మొత్తం డబ్బులు చెల్లించేవారు.. కానీ ఇప్పుడు మాత్రం తమ దగ్గర ఉన్నటువంటి పాత బంగారు ఆభరణాల్ని ఇచ్చి వాటి విలువకు కొంత అదనపు మొత్తం జోడించి.. కొత్త డిజైన్లు ఎంపిక చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది.వాస్తవంగా చెప్పాలంటే.. పాత బంగారం ఇచ్చి కొత్త బంగారం తీసుకోవడం అనేది కొత్త విషయం ఏమీ కాకపోయినా.. గతంలో దీనిపై ఎక్కువగా ఆసక్తి చూపించేవారు కాదు. అప్పట్లో బంగారం స్వచ్ఛతను సరిగా అంచనా వేస్తారా? వేయరా? వేరే దుకాణాల్లో కొనుగోలు చేసిన ఆభరణాలకు సరైన ధర ఇస్తారా లేదా? అదనంగా ఛార్జీలు ఏమైనా విధిస్తారా.. ఇలాంటి సందేహాలతో చాలా మంది దీనికి దూరంగా ఉండేవారు. అయితే ఇప్పుడు హాల్ మార్కింగ్ వ్యవస్థ పకడ్బందీగా అమలు చేస్తుండటం, ఆధునిక టెస్టింగ్ పద్ధతులు అందుబాటులోకి రావడంతో చాలా మందిలో ఒకప్పటి భయాలు తగ్గుతున్నాయి.నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రస్తుతం బంగారం ధరలు అధిక స్థాయిల్లో ఉన్న నేపథ్యంలో పాత బంగారు ఆభరణాల్ని మార్పిడి చేసుకోవడం అనేది ఆర్థికంగా ప్రయోజనకర నిర్ణయం అని చెబుతున్నారు.ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.భారత్ ఏటా భారీ మొత్తంలో బంగారం దిగుమతి చేసుకుంటుంది కాబట్టి.. పాత ఆభరణాల్ని రీసైక్లింగ్ చేయడం.. మార్పిడి చేసుకోవడం పెరిగితే అప్పుడు కొత్త బంగారం దిగుమతుల అవసరం కూడా కొంత మేర తగ్గుతుంది. దీంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి కూడా తగ్గుతుంది.

- ఎడిటర్

# పవన్ పక్కా స్కెచ్...

హైదరాబాద్ జూన్ 2, (న్యూస్ పల్స్) ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కెలికితే మామూలుగా ఉండదు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ విషయం తెలుసు. ఆది నుంచి పవన్ కళ్యాణ్ విషయంలో ఆ పార్టీ కొంచెం అతిగా ప్రవర్తించింది. లెక్కలేని తనాన్ని చూపింది. దానికి మూల్యం చెల్లించుకుంది. అయితే నిండా మునిగాక.. చలి ఎందుకు అన్న మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పవన్ కళ్యాణ్ ను శాశ్వత శత్రువు అన్నట్టు చూస్తోంది. మరోవైపు తెలంగాణలో జనసేన పెద్దగా రాజకీయాలు చేయడం లేదు. కానీ ఆ పార్టీకి పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు. సోషల్ మీడియా వరకు యాక్టివ్ గా పని చేస్తూ వస్తున్నారు. కానీ పవన్ పై రాజకీయ కుట్రలు జరుగుతున్న తరుణంలో తెలంగాణలో సైతం జనసేన ను విస్తరించాలన్న ఆలోచనకు పవన్ వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. తెలంగాణలో జనసేన కీలక నేతలకు ఇప్పటికే సమాచారం అందించారు. ఆ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చురుగ్గా జరుగుతున్నాయి.తెలంగాణ విషయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పెద్దగా దృష్టి సారించిన దాఖలాలు లేవు. తెలంగాణ ప్రజలు సైతం పవన్ కళ్యాణ్ విషయంలో చాలా సాఫ్ట్ గా ఉంటారు. రాష్ట్ర విభజన సమయంలో సైతం ఇక్కడి వారి భావోద్వేగాన్ని గుర్తించారు పవన్ కళ్యాణ్. వాటిని గౌరవించారే తప్ప ఎన్నడు వ్యతిరేకించలేదు. తెలంగాణ కళాకారులను గౌరవించారు. గద్దర్ లాంటి వారిని ఎంతగానో గౌరవించి సొంత అన్నదమ్ముడు మాదిరిగా చూసుకున్నారు. విపత్తుల సమయంలో తెలంగాణ ప్రభుత్వానికి భారీ స్థాయిలో నిధులు కూడా ఇచ్చారు. ప్రాంతీయవాదంతో లెక్క లేకుండా తెలంగాణ సమాజానికి ఎంతో సాయం చేశారు పవన్ కళ్యాణ్. అందుకే తెలంగాణ ప్రజలు పవన్ విషయంలో మరో ఆలోచన చేయరు. కానీ అదే తెలంగాణ నుంచి తనపై కుట్రలు జరుగుతుండడంతో.. గట్టిగానే రిప్లై ఇవ్వాలనుకుంటున్నారు పవన్ కళ్యాణ్. ఇలా కుట్రలు చేస్తున్న వారిని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలంటే పార్టీని యాక్టివ్ చేయడమే ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్ తర్వాత తెలంగాణలో జనసేన నేతలు క్రియాశీలకం అయ్యారు. చాలా దూకుడుతో వ్యవహరిస్తున్నారు. తెలంగాణ సమాజానికి పవన్ కళ్యాణ్ ఎలా సాయం చేశారో ఆధారాలతో సహా వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా రేపు జనసేన ముఖ్య నేతలతో పవన్ కళ్యాణ్ భేటీ కానున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారితో చర్చించనున్నారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధిపై పూర్తి దృష్టి కేంద్రీకరించనున్నారు. ఈ నెలలోనే భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కూడా నిర్ణయించారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇదే ఊపు కొనసాగించి కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్నారు పవన్. వాటిలో గౌరవప్రదమైన సీట్లు దక్కించుకొని.. తెలంగాణ రాజకీయాల్లో మరింత యాక్టివ్ కావాలని భావిస్తున్నారు. చూడాలి ఆయన ప్రయత్నాలు ఎంత వరకు వర్క్ అవుట్ అవుతాయో..



# తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది...

హైదరాబాద్, జూన్ 2, (న్యూస్ పల్స్)తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. రాష్ట్రంలో పార్టీకి మైలేజ్ పెరుగుతున్న తరుణంలో, కీలక నేతల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు గ్రూపు రాజకీయాలను రోడ్డుకు ఈడుస్తోంది. ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు కొందరు నేతలు చేస్తున్న ప్రయత్నాలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తుండటంతో, అటు కేడర్ తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు గురవుతోంది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.బీజేపీలో గత కొంతకాలంగా సాగుతున్న పాత వర్సెస్ కొత్త నేతల వివాదం ఇప్పుడు మరింత ముదిరింది. తాజాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టర్లు వేయడం కలకలం రేపింది. ఈ వ్యవహారం వెనుక కేంద్రమంత్రి బండి సంజయ్ వర్గానికి చెందిన కొందరి హస్తం ఉందంటూ ఈటల అనుచరులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్ కొంతకాలంగా సాన్నిహిత్యంగా ఉంటుండటాన్ని జీర్ణించుకోలేక, వారి మధ్య గ్యాప్ పెంచేందుకే ఈ పోస్టర్ల కుట్రకు తెరలేపారనే టాక్ వినిపిస్తోంది.అయితే, దీనికి కౌంటర్‌గా బండి సంజయ్ అనుచరులు మరో వాదనను తెరపైకి తెస్తున్నారు. గతంలో బండి సంజయ్ కొడుకు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం వెనుక, అలాగే బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి దించేయడం వెనుక పరోక్షంగా ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ మరికొందరు నేతల హస్తం ఉందంటూ వారు పాత విషయాలను గుర్తు చేస్తున్నారు. ఈ వివాదాల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఇరు వర్గాల మధ్య పరస్పర పోస్టులు, తీవ్ర విమర్శలు వైరల్ అవుతున్నాయి."ఈటల ఏడుపే బీజేపీకి శాపం.. రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని, సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని, కేంద్రమంత్రి పదవి రాలేదని నిరంతరం అసంతృప్తితో ఉంటున్నారు. రెండు చోట్ల ఎమ్మెల్యేగా ఓడిపోయినా మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపిస్తే? మోడీ ఇమేజ్‌తో కాకుండా తన సొంత ఇమేజ్‌తోనే గెలిచాననడం రాజకీయ నైతికత కాదు. ఇందూరు బిడ్డ ఎంపీ అర్వింద్‌కు వస్తున్న ఆదరణ చూసి కడుపుమంట ఎందుకు? నేనే ప్రత్యామ్నాయం అనే భ్రమ నుంచి బయటకు రావాలి." అని ఈటలపై పోస్టర్లు పెద్దఎత్తున వెలిశాయి.అయితే, ఈ ఆధిపత్య పోరు వెనుక అసలు కారణం కేంద్ర మంత్రివర్గ విస్తరణే అనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా నడుస్తోంది. గతంలో బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్న సమయంలో? తమకు కూడా అవకాశం వస్తుందని ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ తదితరులు ఆశించారు. కానీ బండికి మాత్రమే అవకాశం దక్కడంతో వారంతా తీవ్ర నిరాశకు గురయ్యారు. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరగబోతోందని, తెలంగాణ నుంచి మరొకరికి అవకాశం దక్కే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మంత్రి పదవి రేసులో ముందంజలో ఉండాలనే తాపత్రయమే తాజా గ్రూపు రాజకీయాలకు, పరస్పర దుష్ప్రచారాలకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిసిన వ్యవహారాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్రంగా ఖండించారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఈటల లాంటి సీనియర్ నేతను కించపరిచేలా నీచ రాజకీయాలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇది కేవలం ఒక నాయకుడిపై జరిగిన వ్యక్తిగత దాడి మాత్రమే కాదని, తెలంగాణలో బీజేపీ పుంజుకోవడాన్ని చూసి ఓర్వలేక ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న కుట్రగా వారు అభివర్ణించారు. రాష్ట్ర బీజేపీ నేతలమంతా ఐక్యంగా ఉన్నామని, ఇలాంటి కుట్రలను తిప్పికొడతామని వారు స్పష్టం చేశారు. నేతలు పైకి ఐక్యత రాగం వినిపిస్తున్నప్పటికీ, లోపల జరుగుతున్న అంతర్గత పోరును కేంద్ర అధిష్టానం ఎలా సర్దుమణిగిస్తుందో వేచి చూడాలి.తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభ తర్వాత, రాష్ట్రంలో బీజేపీ చేపట్టిన 'రైతు ఘోష ? బీజేపీ భరోసా యాత్ర' అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. నాలుగు రోజుల పాటు సాగిన ఈ యాత్ర.. ఊహించిన దానికంటే.. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న అధికార పక్షాన్ని తీవ్రంగా భయపెట్టడంలో విజయవంతమైంది. ఒక ప్రతిపక్ష నేత చేసే యాత్ర ఎంతవరకు ప్రభావం చూపించిందో చెప్పడానికి ప్రభుత్వ స్పందనే కొలమానం. మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్ర సృష్టించిన ప్రభావం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహేశ్వర్ రెడ్డి గురి పక్కాగా తగిలిందని అర్థమవుతోంది. యాత్ర సందర్భంగా మహేశ్వర్ రెడ్డి విసిరిన సవాల్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. "రాష్ట్రంలో 80 శాతం ధాన్యం కొనుగోళు జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దమ్ముంటే ఎక్కడ జరిగాయో చూపించండి, నేను నిరూపించడానికి సిద్ధం. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి? ఆయన గెలిస్తే నేను రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటా!" అంటూ మహేశ్వర్ రెడ్డి విసిరిన పొలిటికల్ ఛాలెంజ్ కాంగ్రెస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేసింది. ఈ యాత్రకు బీజేపీ అగ్ర నేతల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు దక్కకపోయినప్పటికీ.., మహేశ్వర్ రెడ్డి తన వ్యక్తిగత సామర్థ్యంతో, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వంతో ఈ కార్యక్రమాన్ని విజయతీరాలకు చేర్చారు. అలాగే నిస్తేజంగా ఉన్న గ్రౌండ్ కేడర్‌ను యాక్టివ్ చేసి, రైతుల గుండెల్లోకి బీజేపీని తీసుకెళ్లడంలో మహేశ్వర్ రెడ్డి పూర్తిగా కృతకృత్యులయ్యారబెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వం తన తదుపరి పూర్తి ఫోకస్‌ను తెలంగాణపైనే పెట్టబోతోందనే అంశంపై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఈ కీలకమైన కార్యక్రమ బాధ్యతను హైకమాండ్ మహేశ్వర్ రెడ్డికి అప్పగించడం వెనుక అధిష్ఠానం ఏదైనా పెద్ద వ్యూహాన్నే అమలు చేసిందా? అనే టాక్ వినిపిస్తోంది. ఈ యాత్రను ఒక 'టెస్టింగ్ గ్రౌండ్' లాగా భావించిన అధిష్ఠానం రాష్ట్రంలో పార్టీని పరుగులు పెట్టించడానికి మహేశ్వర్ రెడ్డే సరైన వ్యక్తి అని భావించి ఈ బాధ్యతలు అప్పగించిందా? అధిష్ఠానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. క్షేత్రస్థాయిలో ఉన్న లీడర్లందరినీ సమన్వయం చేసుకుంటూ ఆయన ఈ యాత్రను ఘన విజయం వైపు నడిపించారని పార్టీ భావిస్తోందా? దీనిపై రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు ఉండబోతున్నాయి? అంటూ రాజకీయ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఈ యాత్ర విజయం బీజేపీ క్యాడర్‌లో మరింత ఉత్సాహాన్ని పెంచుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## హరీష్ రావు పార్టీ మార్పు ప్రచారం

మెదక్, జూన్ 2, (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు పార్టీ మార్పు అంశం మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు, దానికి హరీష్ రావు అంతే ఘాటుగా ఇచ్చిన కౌంటర్లతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. గత కొన్ని రోజులుగా తెరవెనుక నడుస్తున్న ఈ ప్రచారం.. ఇప్పుడు ఇద్దరు అగ్ర నేతల మధ్య బహిరంగ సవాల్‌గా మారింది.ఇటీవల మీడియాతో నిర్వహించిన ఒక చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. హరీష్ రావు రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే క్లారిటీ లేదని, భవిష్యత్తులో ఆయన ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదంటూ ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, గత చరిత్రను తవ్వుతూ 2008లో హరీష్ రావు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసింది నిజం కాదా? అని రేవంత్ ప్రశ్నించారు. ప్రస్తుతం హరీష్ రావు ఎవరెవరితో టచ్‌లో ఉన్నారో, ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు పూర్తి సమాచారం ఉందని సీఎం వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్ మీద ఒట్టేసి.. తాను బీజేపీలో చేరబోనని హరీష్ రావు చెప్పగలరా? అంటూ రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌పై హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ వ్యాఖ్యలను పూర్తిగా ఖండించారు. తన రాజకీయ నిబద్ధత ఏంటో అందరికీ తెలుసన్నారు. "నా పుట్టుక బీఆర్ఎస్.. నా జీవితమంతా బీఆర్ఎస్.. నా చావు కూడా బీఆర్ఎస్ పార్టీలోనే" అని హరీష్ రావు తేల్చి చెప్పారు. ఇప్పటికే ఈ విషయాన్ని తాను వంద సార్లు చెప్పానని, అవసరమైతే మరో వంద సార్లు చెప్పడానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. జీవితాంతం కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తానని పునరుద్ఘాటించారు. నాలుగు పార్టీలు మారిన రేవంత్ రెడ్డికి నా నిబద్ధత గురించి మాట్లాడే నైతిక అర్హత ఎక్కడిదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అసలు మాటలకు విలువ ఎక్కడుందని ఎద్దేవా చేశారు.తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరిన నేపథ్యంలో, హరీష్ రావు లాంటి బలమైన నేతను టార్గెట్ చేయడం ద్వారా ప్రతిపక్షాన్ని మరింత బలహీనపరచాలనే వ్యూహంలో కాంగ్రెస్ ఉన్నట్లు కనిపిస్తోంది. 2008 నాటి వైఎస్సార్ కలయిక ప్రస్తావనను తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ శ్రేణుల్లో అనుమానాలు రేకెత్తించేందుకు సీఎం ప్రయత్నించగా.. హరీష్ రావు మాత్రం తన మాతృసంస్థపై, కేసీఆర్ నాయకత్వంపై ఉన్న నమ్మకాన్ని గట్టిగా చాటుకుంటూ ఆ ప్రచారానికి బ్రేక్ వేసే ప్రయత్నం చేశారు.

## వివాదంలో ఉప్పల్ ఎమ్మెల్యే

హైదరాబాద్ జూన్ 2, (న్యూస్ పల్స్)పిల్లలు క్రికెట్ ఆడుకుంటున్నారనే నెపంతో ఒక అధికార పార్టీ నేత దంపతులపై దారుణంగా దాడి చేయడమే కాకుండా, పోలీసులను అడ్డం పెట్టుకుని స్టేషన్‌లో వారిచేత బలవంతంగా కాళ్లు మొక్కించుకున్న ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది.బీహార్ ప్రాంతానికి చెందిన లీలావతి, ఆమె భర్త ఉప్పల్ ఐడీఏ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో నివసిస్తూ అక్కడి ఒక అట్టల కంపెనీలో పనిచేస్తున్నారు. మే 25వ తేదీ సాయంత్రం లీలావతి తన ఇద్దరు పిల్లలు, మరికొందరితో కలిసి కాలనీ రోడ్డుపై క్రికెట్ ఆడుతుండగా, అదే కాలనీలో ఉండే కాంగ్రెస్ నేతకు అది నచ్చలేదు. రాత్రిపూట ఆటలేంటి అంటూ బూతులు తిడుతూ ఆయన రోడ్డుపైకి వచ్చాడు.లీలావతి దీనిని ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురైన ఆ నేత, ఆమె బట్టలు చినిగిపోయేలా దాడికి దిగాడు. అడ్డువచ్చిన ఆమె భర్తను కూడా చితకబాదడంతో, అతని కంటి పైభాగంలో తీవ్ర గాయమై రక్తం కారింది. ఆ తర్వాత దాడి చేసిన సదరు నేత స్వయంగా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, రాత్రి పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి బాధితులను స్టేషన్‌కు తరలించారు.బాధితులు తమపై జరిగిన దాడి గురించి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా, స్టేషన్ సిబ్బంది తిరస్కరించారు. ఇదే సమయంలో సదరు నేత తన అధికార బలంతో పోలీసుల సాక్షిగా దంపతులను భయపెట్టాడు. లీలావతి కుటుంబం తన బంగారు గొలుసు దొంగిలించిందంటూ ఒక తప్పుడు ఫిర్యాదు ఇచ్చాడు. దీంతో ఆందోళన చెందిన బాధితులు తమపై దొంగతనం కేసు పెట్టవద్దని ప్రాధేయపడ్డారు. తన కాళ్లు మొక్కి, తప్పు చేశామని ఒప్పుకుంటేనే ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని ఆ నేత అర్ధరాత్రి వేళ స్టేషన్‌లోనే భీష్మించాడు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాధితులు పోలీసుల ముందే అతని కాళ్లు మొక్కడంతో ఆ నేత వారిని వదలిపెట్టాడు.ఈ దారుణానికి సంబంధించిన దాడి వీడియోలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడం, అలాగే తమపై జరిగిన అన్యాయాన్ని, స్టేషన్‌లో ఎదురైన అవమానాన్ని వివరిస్తూ సదరు బాధిత మహిళ తీసుకున్న సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఈ విషయం బయటకు వచ్చింది.


# ఆర్టీసీ బస్సుల్లో రద్దీ తగ్గేదెలా

హైదరాబాద్, జూన్ 2, (న్యూస్ పల్స్)హైదరాబాద్ నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ తలకు మించిన భారంగా మారుతోంది. విద్యాసంస్థలు ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య ప్రారంభమై, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ముగుస్తుండటం, అదే సమయంలో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగుల రాకపోకలు కూడా తోడవడంతో బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ రద్దీ సమస్యకు విద్యాసంస్థలు, ఆఫీసుల వేళలను మార్చడమే ఏకైక పరిష్కారంగా కనిపిస్తోంది. అయితే, కాలేజీల సమయాలను మార్చాలని గతంలో గ్రేటర్ ఆర్టీసీ 100 ఇంజినీరింగ్ కళాశాలలకు లేఖలు రాసినప్పటికీ యాజమాన్యాల నుంచి ఆశించిన స్పందన రాలేదు. రాబోయే విద్యా సంవత్సరం నాటికైనా ఈ సమన్వయం కుదిరితే ప్రయాణికుల తిప్పలు తప్పుతాయి.నగర శివార్లయిన మొయినాబాద్, ఘటకేసర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, శంకర్ పల్లి, చేవెళ్ల, పటాన్‌చెరు వంటి రూట్లలో విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, మెహదీపట్నం, సీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, హయాత్‌నగర్ వైపు నడిచే బస్సుల్లో ఉదయం 7 గంటలకే మొదటి స్టేజీ నుంచే ప్రయాణికులు కిక్కిరిసిపోతున్నారు. వరుసగా బస్సులు పంపినా రద్దీ తగ్గకపోవడంతో, వెనుక వచ్చే ప్రయాణికుల కోసం బస్సులను సర్దుబాటు చేయడం ఆర్టీసీకి పెద్ద సవాల్‌గా మారింది.సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతుండటంతో బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. ఫుట్‌బోర్డు ప్రయాణాల వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం పెరగడమే కాకుండా ప్రయాణాల్లో తీవ్ర ఆలస్యం చోటుచేసుకుంటోంది. పీక్ అవర్స్‌లో బస్సుల సర్దుబాటు లేకపోవడంతో బస్టాపుల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. సబర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉండగా.. ప్రధానంగా మహాలక్ష్మి పథకం ప్రయాణికులు (మహిళలు) తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ తీవ్ర రద్దీని అదుపు చేయడానికి నిపుణులు కొన్ని ప్రతిపాదనలను సూచిస్తున్నారు.

# వాస్తవాలకు దూరంగా నివేదికలు

విజయవాడ, జూన్ 2, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు ఇస్తున్న క్షేత్ర స్థాయి నివేదికలపై పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై వాస్తవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు ఉంచడం లేదు. చంద్రబాబు జిల్లా పర్యటనల్లోనూ, ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిపే జిల్లా కలెక్టర్ సమావేశంలోనూ నిజాలను దాచిపెట్టి ఆల్ ఫీల్ గుడ్ అంటూ చెబుతుండటంతో దానిని ఆయన నమ్మేస్తున్నారంటున్నారు. గ్రౌండ్ లెవెల్లో ప్రజలు కూటమి సర్కార్ పట్ల తెలియజేస్తున్న అభిప్రాయాన్ని మాత్రం దాచి పెడుతున్నారు. చంద్రబాబు అయినా, జగన్ అయినా అధికారులపై ఆధారపడక తప్పదు. ఐఏఎస్, ఐపీఎస్ లు పాలనపరంగా కీలకం కావడంతో వారిపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే అదే సమయంలో వాస్తవ విషయాలను, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయాలను ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించాలి. ఎమ్మెల్యేల పనితీరును కూడా పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది నుంచి అడిగి తెలుసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు టీడీపీలో ఇప్పటికీ ఉన్నారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర, కళా వెంకట్రావు వంటి వారితో ముఖాముఖి సమావేశమైతే వారు అసలు విషయాలను చెబుతారంటున్నారు. మరొకవైపు జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి తాము క్యాడర్ కు అండగా ఉంటామని చెబుతున్నారు. కానీ అదే సమయంలో వారి నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం లేదు. దీనివల్ల చంద్రబాబుకు తప్పుడు నివేదికలు అందుతున్నాయని సీనియర్ నేతలే వాపోతున్నారు. ముఖ్యమంత్రిగా పాలనలో తలమునకలై ఉండవచ్చు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి వేగంగా తీసుకెళుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అంత బాగా లేదని, సంక్షేమ పథకాలు కొందరు అర్హులకు కూడా అందకపోవడాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు తన పాలనలో ఏం జరుగుతుందన్న విషయాన్ని నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# రాపాక, ఆమంచి దారెటు...



రాజమండ్రి జూన్ 2,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పార్టీలు మారడం కొత్త విషయం కాదు. పరిస్థితులకు అనుగుణంగా నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకుంటూ ఉంటారు. అయితే కొందరు నేతల విషయంలో ప్రస్తుతం వారు ఏ పార్టీలో ఉన్నారనే సందేహమే రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు చెందిన ఇద్దరు ప్రముఖ నాయకుల రాజకీయ ప్రయాణం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాజోలు నియోజకవర్గానికి చెందిన రాపాక వరప్రసాద్ రాజకీయ ప్రస్థానం గత కొన్నేళ్లుగా అనేక మలుపులు తిరిగింది. 2019 ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసి విజయం సాధించిన ఏకైక అభ్యర్థిగా ఆయన గుర్తింపు పొందారు. ఆ ఎన్నికల్లో జనసేనకు పెద్దగా విజయాలు రాకపోయినా, రాపాక మాత్రం తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. అయితే ఎన్నికల తర్వాత రాజకీయ పరిస్థితులు మారడంతో ఆయన వైసీపీ కి దగ్గరయ్యారు. కాలక్రమేణా వైసీపీతో ఆయన అనుబంధం మరింత బలపడింది. గత ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఆయనకు పార్లమెంట్ టికెట్ కూడా ఇచ్చింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా కూటమిప్రభావం ఎక్కువగా ఉండటంతో ఆయనకు ఆశించిన ఫలితం దక్కలేదు. ఎన్నికల తర్వాత వైసీపీ కూడా అధికారాన్ని కోల్పోవడంతో రాపాక రాజకీయ వైఖరిపై మళ్లీ చర్చ మొదలైంది. కొంతకాలంగా ఆయన తిరిగి జనసేనలో చేరే ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపించింది. ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా పార్టీని వదిలి వెళ్లిన నాయకుల పునరాగమనంపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అయితే రాపాక పేరు నేరుగా ప్రస్తావించకపోయినా, ఒకసారి పార్టీని వీడిన వారిని తిరిగి చేర్చుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తామని సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతం రాపాక వైసీపీకి దూరంగా ఉంటున్నప్పటికీ, భవిష్యత్తులో ఆయన ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకుంటారనే ఆసక్తి కొనసాగుతోంది. ఇక చీరాల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ఆమంచి కృష్ణమోహన్ పరిస్థితి కూడా దాదాపు ఇదే విధంగా ఉంది. ఒకప్పుడు వైసీపీలో కీలక నేతగా ఉన్న ఆయన, తరువాత కాంగ్రెస్ లో చేరి గత ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన రాజకీయ కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయి. కాంగ్రెస్ కార్యక్రమాల్లో కూడా పెద్దగా కనిపించకపోవడంతో ఆయన భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు మొదలయ్యాయి. తిరిగి వైసీపీలో చేరే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఆమంచి ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఆయన తదుపరి అడుగు ఏమిటన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర అంశంగా మారింది. రాబోయే ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో ఈ ఇద్దరు నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును ఎలా మలుచుకుంటారన్నది చూడాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం వారు ఏ రాజకీయ శిబిరానికి పూర్తిగా దగ్గరగా ఉన్నారో స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

# నిద్రలోనే ఇద్దరు మహిళలు సజీవదహనం

ఏలూరు ,వేలేరుపాడులో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో వలగాని సావిత్రి ఇల్లు, పక్కనే ఉన్న లక్ష్మి ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సావిత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఆమె, సూర్యాపేట జిల్లా నుంచి వచ్చిన ఆమె అక్క సిగ పూలమ్మ ఇద్దరూ నిద్రలోనే సజీవదహనమయ్యారు. లక్ష్మి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# డీఎస్సీ వార్ - వైసీపీ వర్సెస్ లోకేష్..



విజయవాడ, జూన్ 2, ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ-2025 నియామకాల చుట్టూ ఇప్పుడు రాజకీయ యుద్ధం ముదిరింది. వైఎస్సార్‌సీపీ ఈ ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపిస్తుండగా, ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఆరోపణలను తోసిపుచ్చుతూ ఎదురుదాడికి దిగారు. అయితే ఎదురుదాడి కాదని వైసీపీ చేస్తున్న ఆరోపణలకు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. ఏపీలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన మెగా డీఎస్సీ ఒక మెగా స్కామ్ అని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ, మెరిట్ జాబితాలో అక్రమాలు, స్పోర్ట్స్ కోటా కింద పోస్టుల విక్రయం వంటివి జరిగాయని ఆయన వాదిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీఈఆర్టీ లో పనిచేసిన ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి స్టేట్ టాపర్‌గా రావడం వెనుక లోతైన కుట్ర ఉందని, దీనిపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఆరోపణలను ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని జగన్‌కు, తమను విమర్శించే నైతిక హక్కు లేదని లోకేష్ మండిపడ్డారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో ప్రశ్నపత్రం లీకేజీ అనేది సాంకేతికంగా అసాధ్యమని విద్యాశాఖ వివరణ ఇచ్చింది. సుమారు 16,347 పోస్టులను కేవలం 148 రోజుల్లోనే అత్యంత పారదర్శకంగా భర్తీ చేశామని, నియామక ప్రక్రియపై న్యాయస్థానాలు కూడా క్లీన్ చిట్ ఇచ్చాయని మంత్రి గుర్తు చేశారు. వైసీపీ కోరుతున్నట్లుగా సీబీఐ విచారణ జరిపే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేనట్లు తెలుస్తోంది. పైగా, ప్రభుత్వంపై బురద చల్లేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెడతామని విద్యాశాఖ హెచ్చరించింది. అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, మెరిట్ జాబితాలను ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచామని అధికారులు స్పష్టం చేశారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్ , మీడియా సంస్థలకు డెఫమేషన్ నోటీసులు ఇస్తామని కూడా ప్రభుత్వం హెచ్చరించింది. ఈ వివాదం ఇప్పుడు నిరుద్యోగ యువతలో చర్చకు దారితీస్తోంది. వైసీపీ తన ఆరోపణల ద్వారా ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలని చూస్తుంటే, లోకేష్ మాత్రం జాబ్ క్యాలెండర్ అమలు ద్వారా యువతకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్క అక్రమం జరిగిందని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం అని లోకేష్ సవాల్ విసరడం ద్వారా ప్రభుత్వం తన పారదర్శకతపై నమ్మకంగా ఉన్నట్లు కనిపిస్తోంది. చివరగా చెప్పాలంటే, వైసీపీ ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమించాలని చూస్తుంటే.. ప్రభుత్వం మాత్రం రికార్డు స్థాయి సమయంలో నియామకాలు పూర్తి చేశామనే అంశాన్ని తన విజయంగా చెప్పుకుంటోంది. విచారణ సంగతి ఎలా ఉన్నా, ఈ డీఎస్సీ వార్ మాత్రం ఇరు పార్టీల మధ్య యుద్ధాన్ని మరింత వేడెక్కించింది. వస్తే కొండ.. పోతే ఈక.. అన్నట్టు ఆలోచనతో ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. మెగా డీఎస్సీ 2025 పై భారీగానే ప్లాన్ చేసింది ఆ పార్టీ. ఏడాది తరువాత అక్రమాలు జరిగాయి అంటూ ఆరోపణలు చేస్తోంది. కేవలం ఆరోపణలకు మాత్రమే పరిమితం అవుతోంది. ఎక్కడ న్యాయపోరాటం చేయడం లేదు. దీని వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్కా స్కెచ్ అర్థం అవుతోంది. కేవలం రాష్ట్రంలో లక్షలాది ఓట్లను టార్గెట్ చేసుకునే ఈ కొత్త ప్రచారానికి తెర తీసింది. పోతే వేల ఓట్లు.. వస్తే లక్షల కోట్లు అన్నట్టు ఆలోచన చేసింది. గట్టిగానే ప్రణాళిక వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తోంది. సాక్షి మీడియాలో వ్యతిరేక కథనాలు వడ్డిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఒక్క ఉపాధ్యాయ పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. కనీసం అటువంటి ఆలోచన చేయలేదు. అధికారంలోకి వస్తే ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చారు జగన్. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ శిక్షణ పొందిన లక్షలాదిమంది ఆశగా ఎదురు చూశారు. కానీ వారికి అవకాశం ఇవ్వలేదు జగన్. 2024 ఎన్నికలకు నెల రోజుల ముందు 6100 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో డీఎస్సీ రద్దయింది. దీంతో లక్షలాదిమందికి ఎదురుచూపులు మిగిలిపోయాయికూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్ పై సంతకం చేశారు సీఎం చంద్రబాబు. నారా లోకేష్ నేతృత్వంలో డీఎస్సీ నియామక ప్రక్రియ గడువులోగా పూర్తి చేయగలిగారు. గత ఏడాది ఉపాధ్యాయులను నియమించారు. అయితే కూటమికి అదో ప్లస్ పాయింట్ గా మారింది. ఉపాధ్యాయ వర్గాల్లో కూడా సంతృప్తి కనిపిస్తోంది. అయితే ఇది అంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించలేదు. అందుకే కొత్త ప్రణాళిక వేసింది. డీఎస్సీలో అక్రమాలు జరిగాయి అంటూ జగన్మోహన్ రెడ్డి ఆరోపణలు చేయడం ప్రారంభించారు. ఏదైనా నియామక ప్రక్రియ పై ఆరోపణలు వస్తే వెంటనే కోర్టుకు వెళ్లాలి. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అలా చేయలేదు. ఎందుకంటే డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదు. ఆ విషయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తెలుసు. బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేయడం కంటే దీనిని రాజకీయం చేయడానికి ఎక్కువగా వాడుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. దాదాపు ఆరు లక్షల మంది డీఎస్సీ పరీక్ష రాశారు. అందులో 16 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. కానీ అభ్యర్థుల్లో ఒక రకమైన గందరగోళం సృష్టించాలన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన. పోతే 16,000 ఓట్లు.. వస్తే లక్షల ఓట్లు అన్నది ఆ పార్టీ ఆలోచన. ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగానికైనా రిజర్వేషన్లు అమలు చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తెలుసు. కుల రిజర్వేషన్లతో పాటు దివ్యాంగులకు కొన్ని పోస్టులు కేటాయించాలి. ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా అలానే చేసింది. నిన్ననే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ పూర్తి క్లారిటీ ఇచ్చారు. సుదీర్ఘ వివరణ ఇచ్చారు. సాక్షి మీడియాలో డీఎస్సీ అక్రమాలంటూ వచ్చిన కేస్ స్టడీ పై కూడా స్పష్టతనిచ్చారు. అయితే ఇదంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలియనిది కాదు. డీఎస్సీ పై బురద జల్లి ప్రభుత్వానికి క్రెడిట్ రాకుండా చేయాలి. డీఎస్సీలో ఉద్యోగం రాని వారికి అనుమానం పెంచి వారిని తమ వైపునకు తిప్పుకోవాలి. అంతకుమించి ఏమీ కనిపించడం లేదు కూడా ఇందులో.


# సేనా గళంతో ప్లాన్

ఒంగోలు, జూన్ 2,ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యువతను రాజకీయాల్లో మరింత చురుకుగా భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు కొత్త తరం ఆలోచనలకు ప్రాధాన్యం కల్పించేందుకు "సేనా గళం" పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. యువత ఆశయాలు, సామాజిక బాధ్యతలు, దేశాభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ వేదికను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్-జీ తరం ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, రాజకీయాల్లో కూడా యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. ఈ కొత్త కమిటీ ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావాలని, రాజ్యాంగ విలువల పరిరక్షణతో పాటు బాధ్యతాయుత రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. నియోజకవర్గాల వారీగా సేనా గళం కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ నాయకత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు యువతకు ఈ కమిటీల్లో ఎక్కువ అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం కూడా ఈ కమిటీల ప్రధాన బాధ్యతగా ఉండనుంది. ఈ వేదికలో సభ్యత్వం పొందే వారికి కులం, మతం, ప్రాంతం వంటి అంశాలతో సంబంధం ఉండదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయాలనే తపన, ప్రజల కోసం పనిచేయాలనే సంకల్పం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. విద్యావంతులు మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో ముందుకు రావాలనుకునే ప్రతి యువకుడికి అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. రాజకీయాల్లో కులపరమైన విభజనలు పెరుగుతున్నాయని, అనేక సందర్భాల్లో వ్యక్తిగత తప్పులను కూడా కులాల పేరుతో సమర్థించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పవన్ కళ్యాణ్ విమర్శించారు. ఇలాంటి ధోరణులకు యువత వ్యతిరేకంగా నిలుస్తోందని, అదే భావజాలాన్ని సేనా గళం ప్రతిబింబిస్తుందని చెప్పారు. వ్యక్తుల చర్యలకు సమాజాన్ని బాధ్యులను చేయడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. పాత రాజకీయ సంస్కృతులకు భిన్నంగా కొత్త ఆలోచనలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆలోచన కలిగిన వారికి జనసేనలో ప్రత్యేక స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యుదయ భావాలు, దేశభక్తి, సామాజిక చైతన్యం కలిగిన యువతను ఈ కార్యక్రమం ద్వారా ఒకే వేదికపైకి తీసుకురావాలనేది పార్టీ లక్ష్యమని వివరించారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడం, యువత సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు సూచించడం వంటి బాధ్యతలను సేనా గళం కమిటీలు నిర్వర్తించనున్నాయి. యువత ఆకాంక్షలు, ఆశయాలు, అభిప్రాయాలకు ప్రతినిధిగా ఈ వేదిక పనిచేస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. దీంతో జనసేన పార్టీ భవిష్యత్ రాజకీయ వ్యూహాల్లో యువతకు మరింత కీలక స్థానం దక్కనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రూటు మార్చినట్లు కనిపిస్తుంది. కొంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రిగా రెండేళ్లు పదవీ కాలం పూర్తి కావడంతో ఆయనకు పాలనపై కొంత వరకూ పట్టు సంపాదించారు. భవిష్యత్ లో ఏదైనా సమస్య ఎదురైతే కూటమి ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్న జనసేన కూడా రాజకీయంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆయన భావిస్తున్నట్లుంది. అందుకే నేరుగా రంగంలోకి దిగి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం కాకుండా, పనుల్లో ఆలస్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. తాజాగా రాజమండ్రి పర్యటనతో పవన్ కళ్యాణ్ కూటమి పార్టీ నేతలకు పవన్ కళ్యాణ్ ఈ రకమైన సంకేతాలను బలంగానే పంపగలిగారు. గోదావరి పుష్కరాలు 2027లో జరగనున్నాయి. 2027 జూన్ నెలలో ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కొన్ని మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేసింది. పుష్కర ఘాట్ల నిర్మాణంతో పాటు భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు, రహదారి మరమ్మతులు వంటివి చేయాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం లైట్ గా తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రం పనులు వేగంగా జరుగుతున్నాయని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. కానీ గ్రౌండ్ లెవెల్లో పనుల పురోగతి ఆశించినంతగా లేదని పవన్ కళ్యాణ్ గుర్తించారు. ఏడు వేల కోట్ల రూపాయల విలువైన పనులను ఏడాదిలో ఎలా పూర్తి చేస్తారంటూ పవన్ కళ్యాణ్ సూటిగానే అధికారులను ప్రశ్నించారు. హడావిడిగా చివరి నిమిషంలో చేపట్టిన నిర్మాణాలు కూలిపోతే ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డపేరు రాదా? అని అధికారులను నిలదీశారు. పనులు వేగంగా జరగకపోవడంపై తాను త్వరలో జరిగే ఏపీ మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని పవన్ కళ్యాణ్ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. హడావుడి పనులతో భక్తుల ప్రాణాలతో చెలగాటం వద్దంటూ వార్నింగ్ ఇచ్చారు. మొత్తం మీద పవన్ కళ్యాణ్ మాత్రం పాలనలో తన మార్క్ చూపించాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది.

# నాగబాబా... లింగమనేని

విజయవాడ, జూన్ 2, ఏపీలో రాజ్యసభ స్థానాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చేసింది. నాలుగు స్థానాలకు ఎన్నిక జరగబోతుంది. ఇవన్నీ కూటమి పార్టీలకు దక్కబోతున్నాయ్. ఐతే పొత్తులో భాగంగా వీటిలో ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో ఇప్పుడు ఆసక్తికర చర్చ మొదలైంది. జనసేన తరఫున మొదటిసారిగా రాజ్యసభలో అడుగు పెట్టబోయేది ఎవరు.. అవకాశం ఎవరికి దక్కబోతోందనే చర్చ పార్టీలో జరుగుతోంది. జనసేనకు ఇది మొట్టమొదటి స్థానం కావడంతో.. పెద్దల సభకు పవన్ ఎవరిని పంపిస్తారు.. ఎలాంటి సమీకరణాలు లెక్కలోకి తీసుకుంటారనే ఆసక్తి పార్టీ వర్గాలతో పాటు పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికర చర్చ కనిపిస్తోంది. రాజ్యసభ స్థానం విషయంలో పవన్ కళ్యాణ్ భారీగా కసరత్తు చేస్తున్నారు. ఇక అటు ఈ ఒక్క స్థానం కోసం ఆశావహులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఇక అటు రేసులో కొందరి పేర్లు కీలకంగా వినిపిస్తున్నాయ్. ఆ లిస్టులో మొదటిగా వినిపిస్తున్న పేరు.. లింగమనేని రమేష్. పవన్‌తో పాటు చంద్రబాబు, నాదెండ్ల మనోహర్‌కు ఆయన అత్యంత సన్నిహితులు. పైగా కష్టకాలంలో పార్టీకి అన్ని రకాలుగా అండగా నిలిచారు. ఇవి లింగమనేని రమేష్‌కు కలిసి వచ్చే అంశాలు. జనసేనకు రాజ్యసభ అవకాశం ఎప్పుడు వచ్చినా.. లింగమనేని రమేష్‌కి ఇస్తారనే పార్టీలో దాదాపు అందరూ ఫిక్స్ అయిపోయిన పరిస్థితి. ఇక ఆయన కూడా చాలాకాలంగా ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది. పవన్ కూడా లింగమనేనికే దాదాపు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక అటు లింగమనేనితో పాటు.. మరికొందరు కూడా రాజ్యసభ స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. ఇందులో ప్రధానంగా నాగబాబు పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆయన.. ఎంపీగా వెళ్లాలని ఎప్పటినుంచో అనుకుంటున్నారు. గతంలో రాజ్యసభ స్థానాల ఎంపిక విషయంలో నాగబాబు పేరు వచ్చినా అది టీడీపీకి కేటాయించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీగా సరిపెట్టుకున్నారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ స్థానం త్యాగం చేయడం.. మంత్రి పదవి కూడా రాకపోవడంతో.. రాజ్యసభకు వెళ్లాలన్న కోరిక అయినా తీర్చుకోవాలని నాగబాబు అనుకుంటున్నారట. ఆయనకు కానీ రాజ్యసభ స్థానం దక్కితే.. నాగబాబు ఎమ్మెల్సీ స్థానాన్ని బాలినేనికి ఇచ్చే అవకాశాలు ఉన్నాయ్. నిజానికి బాలినేని కూడా చాలాకాలంగా ఎమ్మెల్సీ పదవి కోసం ఎదురుచూస్తున్నారు. నాగబాబును రాజ్యసభ పంపిస్తే ఇద్దరికీ అవకాశం ఇచ్చినట్లు అవుతుందనే చర్చ కూడా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ ఇద్దరితో పాటు.. మరికొందరు పారిశ్రామికవేత్తలు, పార్టీలోనే ఉన్న సీనియర్ నిర్మాత ఒంటరత్నం కూడా రాజ్యసభ స్థానం కోసం పవన్ దగ్గర ప్రయత్నాలు చేస్తున్నారట. ఐతే పవన్ మాత్రం.. పార్టీకి చాలా కాలంగా అండదండలు అందిస్తున్న లింగమనేని వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. మరి ఆయన పేరే ఫైనల్ అవుతుందా.. ట్విస్టులు కనిపిస్తాయా.. రాజకీయ సమీకరణాలు మారతాయా అనేది చూడాలి.

# అన్నామలై సొంత పార్టీ దిశగా అడుగులు



చెన్నై, జూన్ 2, (న్యూస్ పల్స్) తమిళనాడు రాజకీయాల్లో ఇప్పుడు సరికొత్త ముఖచిత్రం ఆవిష్కృతం కాబోతోందా? సింగం ఐపీఎస్ ఆఫీసర్‌గా గుర్తింపు తెచ్చుకుని, ఆ తర్వాత కమలం గూటికి చేరి ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన కే. అన్నామలై బీజేపీకి గుడ్‌బై చెప్పబోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ మీడియా వర్గాలు. ఢిల్లీ పెద్దల నిర్ణయాలతో విభేదిస్తూ, ఆయన సొంతంగా కొత్త రాజకీయ పార్టీ లేదా సరికొత్త ఉద్యమాన్ని ప్రారంభించేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నట్లు తెలుస్తోంది. జూన్ 3వ తేదీన ఆయన చెన్నైలో ఒక ప్రెస్ మీట్ పెట్టి, తన భవిష్యత్తు కార్యాచరణను అధికారికంగా ప్రకటించబోతున్నారని తమిళ పాలిటిక్స్ లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో అన్నామలై మద్దతుదారులు ఆయన స్థాపించబోయే కొత్త పార్టీ పేరు, జెండా డిజైన్లను కూడా వైరల్ చేయడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఢిల్లీ కేంద్రంగా సాగే హైకమాండ్ రాజకీయాలకు స్వస్తి చెప్పి, తమిళనాడు మట్టి వాసన తెలిసిన ఒక ప్రాంతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్నదే అన్నామలై ప్లాన్‌గా కనిపిస్తోంది.కేంద్రంలోని బీజేపీ నాయకత్వంతో అన్నామలైకి గత కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 9వ తరగతి విద్యార్థులకు త్రిభాషా సూత్రాన్ని హడావుడిగా అమలు చేయాలని చూడాన్ని అన్నామలై బహిరంగంగానే వ్యతిరేకించారు. తమిళనాడు సెంటిమెంట్‌కు అత్యంత సున్నితమైన భాషా వివాదం విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారని ఆయన ఎక్స్ వేదికగా తప్పుబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆయన ఇలా తిరుగుబావుటా ఎగరేయడం, ఢిల్లీ పెద్దలకు ఆయన పంపుతున్న బలమైన పొలిటికల్ సిగ్నల్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల ముగిసిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో మళ్ళీ పొత్తు పెట్టుకోవాలనే ఢిల్లీ బీజేపీ పెద్దల నిర్ణయం అన్నామలైకి అస్సలు నచ్చలేదు. గతంలో జయలలిత, అన్నాదురైలపై అన్నామలై చేసిన ఘాటు వ్యాఖ్యల వల్లే కూటమి విచ్ఛిన్నమైందని, పొత్తు కుదరాలంటే అన్నామలైని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని ఎడప్పాడి పళనిస్వామి కండిషన్ పెట్టారు. దాంతో హైకమాండ్ ఆయనను తప్పించి నైనార్ నాగేంద్రన్‌ను అధ్యక్షుడిగా నియమించింది. పార్టీ లైన్ దాటకుండా అన్నామలై అప్పట్లో కూటమి తరఫున ప్రచారం చేసినప్పటికీ.. ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒకే ఒక్క స్థానాన్ని గెలుచుకుని ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ వైఫల్యం తర్వాత, ఢిల్లీ పెద్దల చేతుల్లో కీలుబొమ్మగా మారడం కంటే బయటకు రావడమే బెటర్ అని ఆయన డిసైడ్ అయినట్లు టాక్.తమిళనాడులో ప్రస్తుతం ద్రవిడ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలకు తోడు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం అధికారంలోకి వచ్చి సరికొత్త రాజకీయ శకాన్ని ప్రారంభించింది. యువత అంతా విజయ్ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో, తాను కూడా ఒక స్వతంత్ర ప్రాంతీయ శక్తేనని నిరూపించుకోకపోతే తమిళ రాజకీయాల్లో వెనుకబడిపోతామని అన్నామలై భావిస్తున్నారు. అందుకే బీజేపీ రాష్ట్ర ఇన్-ఛార్జ్ నితిన్ నబిన్‌తో అత్యవసర సమావేశాన్ని కోరినట్లు సమాచారం. ఈ చర్చలు విఫలమైతే, గురువారం ఆయన పార్టీ వీడటం ఖాయమని తమిళ పత్రికలు కథనాలు ప్రసారం చేస్తున్నాయి..మరోవైపు, తమిళనాడు బీజేపీ సీనియర్ నాయకులు ఈ ప్రచారాన్ని కొట్టిపారేస్తున్నారు. అన్నామలై పార్టీ వీడటం లేదని, ఆయనకు జాతీయ స్థాయిలో ఒక కీలకమైన బాధ్యతను అప్పగించేందుకు అధిష్టానం ఆలోచిస్తోందని చెబుతున్నారు. ఒకవేళ అన్నామలై నిజంగానే సొంత పార్టీ పెడితే, అది తమిళనాడులో కాస్తో కూస్తో పుంజుకుంటున్న బీజేపీ ఓటు బ్యాంకును ఘోరంగా దెబ్బతీస్తుంది. ఏది ఏమైనా, మాజీ ఐపీఎస్ అధికారి తీసుకోబోయే ఈ తదుపరి అడుగు ఈ వారంలో తమిళనాడు రాజకీయాల్లో ఒక పెను భూకంపం సృష్టించబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తమిళనాడులో 13% ఓటు బ్యాంకు వచ్చిందంటే దానికి ప్రధాన కారణం అన్నామలై. ఎన్డీఏ కూటమి మొత్తానికి 17% శాతం ఓటు బ్యాంకు నమోదయింది. కానీ, 2026 అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి బీజేపీ అధిష్టానం అన్నామలై విషయంలో స్టాండ్ మార్చుకుంది. అన్నా డీఎంకే అధినేత "ఈపీఎస్" ఒత్తిడికి తలవంచి అన్నామలై ని బిజెపి అధ్యక్షుడి స్థానం నుంచి తొలగించింది. ఇది తమిళనాడులో కమలం పార్టీకి మొదటి దెబ్బ. ఆ తర్వాత అన్నా డీఎంకే చెప్పిన స్థానాలలోని బిజెపి పోటీ చేయాల్సి వచ్చింది. అవన్నీ అత్యంత బలహీనమైన స్థానాలు. పనికిమాలిన అన్నా డీఎంకే ఒత్తిడి వల్ల బిజెపి గెలిచే స్థానాలు కోల్పోవడంతో పాటు.. పోటీ చేసే స్థానాల్లో కూడా తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంది.బిజెపి తమిళనాడు అధ్యక్షుడు నుంచి మొదలు పెడితే తమిళ సై సౌందర రాజన్ వరకు తమ స్థానాలను మార్చకుండా అన్నా డీఎంకేతో లోపాయికారి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అయితే వారు కూడా విజయం సాధించలేకపోయారు. చివరికి పార్టీని కూడా బతికించలేకపోయారు. ఎన్నికల్లో బిజెపికి రెండు శాతం ఓటు బ్యాంకు వచ్చిందంటే దానిని ఎలా అర్థం చేసుకోవాలో కమలం పెద్దలే నిర్ణయించుకోవాలి. బిజెపి అధిష్టానం వ్యవహరించిన తీరుతో అన్నామలై తీవ్ర అంతర్మదనంలో వడ్డట్టు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు బిజెపికి రాజీనామా చేసి.. ఆరు నెలల పాటు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకొని.. పార్టీని ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ఇప్పటికే అన్నామలై బిజెపి పెద్దలకు వర్తమానం పంపినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంతవరకు బిజెపి పెద్దలు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మరో వైపు తమిళనాడులో ద్రావిడ వాదానికి సంబంధం లేకుండా రాజకీయాలను రూపొందించాలని అన్నామలై భావిస్తున్నారు. బిజెపి ద్వారా దానిని భర్తీ చేయాలని అనుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకి రాకపోవడంతో ద్రావిడ వాదంతో తమిళ ప్రజలను పిచ్చోళ్లను చేసే ఆ రెండు పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అనుకున్నాయి. చివరి నిమిషంలో విజయ్ మేల్కోవడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. ద్రావిడ వాద సెంటిమెంట్ నిత్యం రగిలిస్తూ.. తమిళ ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నాయి ఆ రెండు పార్టీలు. వాటికి ప్రత్యామ్నాయంగా బిజెపిని రూపొందించాలని అన్నామలై భావించారు. కానీ అధిష్టానం తలతిక్క వ్యవహార శైలి వల్ల ఆయన పార్టీకే దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా బిజెపి అధిష్టానం మేల్కొంటుందా.. అన్నామలైకి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తుందా.. ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

## ములమాడ గ్రామంలో ఉద్రిక్తత

### దళిత కుటుంబంపై దాడి చేశారంటూ ఆరోపణలు

వికారాబాద్,వికారాబాద్ జిల్లా నవాబ్పేట మండలం ములమాడ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో గ్రామ సర్పంచ్ భర్త నరేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి దళిత కుటుంబంపై దాడికి పాల్పడ్డారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బాధితుల కథనం ప్రకారం, నరేందర్ రెడ్డి తన అనుచరులతో మంది వ్యక్తులతో కలిసి జిన్నారం బాలరాజు కుటుంబం నివాసానికి చేరుకుని దాడి చేశారు. ఈ ఘటనలో కుటుంబంలోని మహిళలు, పురుషులు, చిన్నారులను విచక్షణారహితంగా కొట్టారని, ఇంట్లోని సామగ్రిని బయటకు విసిరివేసి ఇంటిపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. దాడి సమయంలో కుటుంబ సభ్యులు భయాందోళనలకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు.ఘటన సమయంలో పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ దాడిని అడ్డుకోవడంలో విఫలమయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని రక్షించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉండగా, నరేందర్ రెడ్డి వ్యవహార శైలిపై గతం నుంచే గ్రామంలో విమర్శలు ఉన్నాయని కొందరు స్థానికులు పేర్కొంటున్నారు. వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన సందర్భాల్లో కూడా దౌర్జన్యాలకు పాల్పడటం, ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడం వంటి ఆరోపణలు గతంలోనూ వినిపించాయని చెబుతున్నారు. జిన్నారం బాలరాజు కుటుంబంపై జరిగిన తాజా ఘటన కూడా అదే ధోరణికి కొనసాగింపుగా కనిపిస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. దళిత కుటుంబంపై జరిగినట్లు చెబుతున్న ఈ దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం సహా సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## చీలక దిశగా తృణమూల్...

కోల్ కత్తా, జూన్ 2, (న్యూస్ పల్స్)పశ్చిమ బెంగాల్ అధికార పక్షమైన ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ, యువ నేత అభిషేక్ బెనర్జీ లేని కొత్త తృణమూల్ కాంగ్రెస్ ఏర్పాటు కాబోతోందా? అనే ఊహాగానాలు బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాతి సమీకరణలు, అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బద్దలవడంతో పార్టీ నిలువునా చీలిపోయే ప్రమాదంలో పడినట్లు కనిపిస్తోంది. మహారాష్ట్రలో శివసేన పార్టీ చీలిపోయిన తరహాలోనే.. ఇప్పుడు బెంగాల్‌లోనూ మహారాష్ట్ర మోడల్ పునరావృతం కాబోతోందా అనే చర్చ సర్వత్రా నడుస్తోంది.ఈ వివాదానికి ప్రధాన కారణం పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన సిగ్నేచర్ రో. ఈ వ్యవహారంలో పార్టీ అంతర్గత విషయాలను బయటపెట్టి, విజిల్‌బ్లోయర్‌లుగా మారిన ఇద్దరు తృణమూల్ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహాలను పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఈ బహిష్కరణ చర్యతో అసమ్మతి శ్రేణులు ఒక్కసారిగా యాక్టివ్ అయ్యాయి. పార్టీకి చెందిన దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు, కొందరు ఎంపీలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు, వారు ఇప్పటికే ప్రత్యామ్నాయ శ్రేణులతో చర్చలు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది కోల్‌కతాలోని మమతా బెనర్జీ నివాసంలో అత్యవసరంగా ఏర్పాటు చేసిన కీలక సమావేశమే ఈ చీలిక ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. పార్టీకి ఉన్న 80 మంది ఎమ్మెల్యేలలో ఏకంగా 60 మంది ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి గైర్హాజరవడం తృణమూల్ కాంగ్రెస్‌లో కలకలం రేపింది. మరోవైపు సమావేశానికి రాని కొందరు ఎమ్మెల్యేలు సీనియర్ నేత రథిన్ ఘోష్ నివాసంలో భేటీ అయినట్లు సమాచారం. అయితే తాను అనారోగ్యం కారణంగానే దీదీ సమావేశానికి వెళ్లలేదని రథిన్ ఘోష్ సమర్థించుకున్నారు. అదే సమయంలో మరికొందరు ఎమ్మెల్యేలు దక్షిణ కోల్‌కతాలోని గేట్‌వే హోటల్‌లో రహస్యంగా సమావేశమవడం బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.ఈ పరిణామాలపై బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ ఫేస్‌బుక్ లైవ్ ద్వారా స్పందిస్తూ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పార్టీలోని ఒక వర్గంతో కలిసి బీజేపీ ఈ కుట్రకు తెరలేపిందని ఆమె ఆరోపించారు. "నలుగురు ఎమ్మెల్యేలు నా దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని తీవ్రంగా భయపెడుతున్నారట. ఒకవేళ కాళీఘాట్ సమావేశానికి హాజరైతే.. ఆయుధాల చట్టం కింద అరెస్ట్ చేస్తామని బెదిరించారట. అసలు ఇది ఎలాంటి ప్రజాస్వామ్యం? రాష్ట్రంలో అణచివేత అన్ని హద్దులు దాటిపోయింది. మా ఎమ్మెల్యేలను, ఎంపీలను ప్రలోభాలతో, బెదిరింపులతో లాక్కోవాలని బీజేపీ చూస్తోంది" అని ఆరోపించారు. తమ పార్టీలోనే ఉంటూ కొంతమంది నాయకులు 'ద్రోహులుగా' మారుతున్నారని, పోలీసు యంత్రాంగాన్ని కూడా ఇందుకు దుర్వినియోగం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.హోటల్‌లో రహస్యంగా సమావేశమైన ఎమ్మెల్యేల తీరుపై తృణమూల్ నేత కునాల్ ఘోష్ తీవ్రంగా మండిపడ్డారు. ఎవరి పేర్లనూ నేరుగా ప్రస్తావించకుండా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఇప్పుడు ఫోన్ కాల్స్ అందుకుంటూ, గేట్‌వే హోటల్‌లో సమావేశాలు పెడుతున్న ఎమ్మెల్యేలందరికీ ఒక్కటే గుర్తు చేస్తున్నా. మనలో ఎవరూ స్వతంత్ర అభ్యర్థులుగా గెలవలేదు. ఒక 70 ఏళ్ల మహిళ రాష్ట్రమంతటా అలుపెరగకుండా తిరుగుతూ కష్టపడితే, ఆమె ముఖాన్ని చూసి ప్రజలు మనకు ఓట్లేసి గెలిపించారు. పార్టీని చీల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న మాట వాస్తవమే. అయితే దీనికి నేను బీజేపీని నిందించను, మనలోని అవకాశవాదులనే బాధ్యులను చేస్తాను. మనుషులన్నాక కనీస నైతికత, మనస్సాక్షి ఉండాలి" అని వ్యాఖ్యానించారు. కాగా ఈ పరిణామాల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్‌లో రేగిన ఈ అసమ్మతి జ్వాలలు ఎటు దారితీస్తాయనేది ఆసక్తికరంగా మారింది.



## రెండు గ్రహాలపై వజ్రాల వాన!

హైదరాబాద్, జూన్ 2, (న్యూస్ పల్స్)విశ్వంలో మనకు తెలియని వింతలెన్నో ఉన్నాయి. భూమి మీద నీటి వర్షం కురవడం సహజం. కానీ మన సౌర కుటుంబంలోని మంచు గ్రహాలైన నెప్ట్యూన్, యురేనెస్‌ల మీద వజ్రాల వర్షం కురుస్తుందని మీకు తెలుసా? ఇది ఏదో సైన్స్ ఫిక్షన్ సినిమా కథ కాదు. శాస్త్రవేత్తలు ప్రయోగపూర్వకంగా నిరూపించిన యథార్థం. ఈ వజ్రాల వాన మనం అనుకున్నదాని కంటే చాలా తక్కువ ఉష్ణోగ్రతలు, పీడనాల వద్దే మొదలవుతుందని తేలింది. అసలు ఈ వజ్రాలు ఎలా ఏర్పడతాయి? అవి ఆగ్రహాల అయస్కాంత క్షేత్రాలను ఎలా మారుస్తున్నాయి?. ఐస్ జెయింట్స్ అని పిలుపుస్తారు. వీటిలో ఘనమైన కోర్ చుట్టూ నీరు, అమ్మోనియం, హైడ్రోకార్బన్లతో కూడిన మందపాటి మంచు పొరలు ఉంటాయి. ఈ గ్రహాల లోపలి భాగంలో పీడనం, ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగతాయి. ఈ తీవ్రమైన పరిస్థితుల్లో, మీథేన్ వంటి హైడ్రోకార్బన్లలోని కార్బొన్, హైడ్రోజన్ విడిపోతాయి. ఆ విడిపోయిన కార్బన్ అణువులు తీవ్రమైన పీడనం వల్ల వజ్రాల స్ఫటికాలుగా మారి, వర్షంలా ఆ గ్రహం లోపలి పొరల్లో కురుస్తాయి. దీనినే శాస్త్రవేత్తలు వజ్రాల వాన అంటారు. వజ్రాల వాన కురుస్తుందని శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా ఊహిస్తున్నప్పటికీ, దానిని ప్రయోగశాలలో మొదటిసారిగా 2017లో గాఒంఅ నేషనల్ యాక్సిలరేటర్ లాబొరేటరీ పరిశోధకులు గమనించారు. అప్పట్లో హై- పరవర్ లేజర్‌లను ఉపయోగించి కేవలం కొన్ని నానో సెకన్లపాటు మాత్రమే ఈ పరిస్థితులను సృష్టించగలిగారు. అయితే 2024లో ప్రచురితమైన పరిశోధనలో జర్మనీలోని యూరోపియన్ ఎక్స్ రే ఫ్రీ ఎలక్ట్రాన్ లేజర్ సహాయంతో శాస్త్రవేత్తలు అద్భుతాన్ని సాధించారు. వీరు పాలీస్టైరిన్ అనే ప్లాస్టిక్ పొరను తీసుకొని, దానిని వజ్రాల మధ్య ఉంచి విపరీతమైన పీడనానికి గురి చేశారు. ఆ తర్వాత ఎక్స్‌రే పల్స్ ద్వారా 2200 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి చేశారు. ఈ ప్రయోగంలో వజ్రాలు మనం గతంలో అనుకున్న దాని కంటే తక్కువ లోతులో తక్కువ పీడనం వద్దే ఏర్పడుతున్నాయని గుర్తించారు. భూమికి ఉండే అయస్కాంత క్షేత్రం చాలా క్రమబద్ధంగా, ఉత్తర, దక్షిణ ధ్రువాల నుంచి విస్తరించి ఉంటుంది. కానీ నెప్ట్యూన్, యురేనస్ గ్రహాల అయస్కాంత క్షేత్రాలు చాలా వింతగా, అసమానంగా ఉంటాయి. ఇవి గ్రహం మధ్యలో కాకుండా ఒక పక్కకు నెట్టివేసినట్టు కనిపిస్తాయి. ఇలా ఎందుకు జరుగుతుందో ఇంత వరకు అంతుచిక్కలేదు. తాజా పరిశోధనల ప్రకారం, ఆకాశం నుంచి వజ్రాలు కిందికి పడుతున్నప్పుడు, అవి తమతోపాటు వాయువులను, మంచును కూడా లాగుతూ కిందకు వెళ్తాయి. ఇది ఆ గ్రహంలోని విద్యుత్ ప్రసరణ చేసే మంచు పొరల్లో ఒకరమైన కదలికను కలిగిస్తుంది. ఈ కదలికలే ఒక డైనమోలాగా పని చేసి ఆగ్రహాలకు వింతైన అయస్కాంత క్షేత్రాలను సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. మన సౌర కుటుంబంలోని గ్రహాల లోపల ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఈ పరిశోధన దోహదపడుతుంది. విశ్వంలో నెప్ట్యూన్ కంటే చిన్నగా ఉండే మినీ- నెప్ట్యూన్స్ అత్యంత సాధారణమైన గ్రహాలు. అక్కడ కూడా ఇలాంటి వజ్రాల వాన కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రయోగశాలలో ప్లాస్టిక్ నుంచి వజ్రాలను తయారు చేసే ఈ పద్ధతిని భవిష్యత్‌లో మెడిసిన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వాణిజ్యం పరంగా వాడుకోవచ్చు.ప్రయోగశాలలో ఇవి నానో మీటర్ల పరిమాణంలో ఏర్పడినప్పటికీ, నెప్ట్యూన్ గ్రహం మీద ఇవి లక్షల క్యారెట్ల బరువు ఉండే పెద్ద వజ్రాలుగా మారే అవకాశం ఉంది. పై నుంచి వజ్రాలు కిందకు పడుతున్నప్పుడు అవి ఘర్షణ వల్ల వేడిని పుట్టిస్తాయి. ఇది ఆ గ్రహం లోప అదనపు ఉష్ణశక్తిగా మారుతుంది. భూమి మీద వర్షపు చినుకులు ఎలా పడతాయో, వేరే గ్రహాల మీద వజ్రాలు లేదా లోహాలు వర్షం కూడా భౌతిక శాస్త్ర నియమాల ప్రకారమే జరుగుతుందని హార్వర్డ్ పరిశోధకులు వివరిస్తున్నారు.

## మల్లారెడ్డి సార్ కథ... బుర్రే... బుర్ర...

హైదరాబాద్ జూన్ 2, (న్యూస్ పల్స్)సంపాదనకు అలవాటు పడ్డ మనిషి ప్రతి దాంట్లో కూడా డబ్బునే చూస్తాడు. పైసా పెట్టుబడి పెడితే ఎంత లాభం వస్తుందో ముందుగానే అంచనా వేస్తాడు.. అటువంటివారు ఎందరో అడుగుపెట్టినా సరే ధనలక్ష్మి పరుగులు తీసుకుంటూ వస్తుంది. ఇటువంటి అదృష్ట జాతకులు కొంతమంది మాత్రమే ఉంటారు. అందులో మన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సార్ మొదటి స్థానంలో ఉంటాడు.పాల వ్యాపారంతో మొదలుపెట్టి.. పూలను అమ్మే స్థాయికి ఎదిగి.. బోర్వెల్ వ్యాపారం స్టార్ట్ చేసి.. ఎన్నో పాఠశాలలు.. కళాశాలలు.. ఇప్పుడు ఏకంగా దేశంలోనే ఏఐ యూనివర్సిటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే మల్లారెడ్డి కథ ఈ కథనంతోనే ముగియదు. ఎన్ని రకాల విమర్శలు ఉన్నా.. మల్లారెడ్డి స్టయిల్ వేరే విధంగా ఉంటుంది. తన పొలిటికల్ లీడర్ కాకముందు ఒక వ్యాపారి. వ్యాపారిగా విజయం సాధించిన తర్వాత.. తన ఆస్తులను కాపాడుకునేందుకు రాజకీయాల్లోకి వచ్చారు. చాలామంది ఆయన సేవ చేయడానికి వచ్చారు అంటారు గాని.. ఒక వ్యాపారి సమాజ సేవ చేయడం ఈ దేశం ఇంతవరకు చూడలేదు. ఇకముందు చూసే అవకాశం లేదు.తాజాగా మల్లారెడ్డి ప్రొఫెసర్ అవతారం ఎత్తారు.. ఏఐ పాఠాలు చెప్పడం మొదలుపెట్టారు. అందులో ఏం నేర్చుకోవాలి.. ఎలా నేర్చుకోవాలి.. అనుభవాన్ని ఎలా ఉపయోగించుకోవాలి.. ఈ కాలానికి మనల్ని మనం ఎలా మార్చుకోవాలి అనే అంశాల మీద పాఠాలు చెప్పారు. జీవిత సారాన్ని అవపోసన పట్టిన వ్యక్తిగా మల్లారెడ్డి వాస్తవాలను చెప్పుకుంటూ పోయారు.. చాలామంది ఆయన మాటలకు కనెక్ట్ అయ్యారు.. అయితే చివర్లో మల్లారెడ్డి ఒక ట్విస్ట్ ఇచ్చారు.

## బీజేపీలోకి విజయ్ మాజీ భార్య సంగీత..?



చెన్నై, జూన్ 2, (న్యూస్ పల్స్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ దళపతి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ అద్భుత విజయం సాధించింది. మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విజయ్ సీఎం అయ్యారు. ఈ ఎన్నికల్లో ద్రవిడ పార్టీలను ప్రజలు ఓడించారు. ఈ క్రమంలో తాజాగా తమిళ రాజకీయాల్లో కొత్తగా మొదలైన ఒక హాట్ టాపిక్ విజయ్ మాజీ భార్య సంగీతా బీజేపీవైపు మొగ్గు చూపుతున్నారని. ఈ ప్రచారం ప్రకారం, విజయ్ రాజకీయ ప్రభావాన్ని బలహీనపరచడానికి బీజేపీ ఈ వ్యూహం చేస్తోందని, పార్టీలోని ఒక ప్రముఖ నటి ఈ ప్రయత్నాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని చెబుతున్నారు. ఇది కేవలం రూమర్ మాత్రమే కావచ్చు, కానీ తమిళనాడు పొలిటికల్ తెరపై ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ రాజకీయ ప్రవేశం తర్వాత కుటుంబ సమస్యలు, విడాకులు వంటి వ్యక్తిగత అంశాలు కూడా రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయివిజయ్ సినిమా నటుడి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన తర్వాత అతని వ్యక్తిగత జీవితం ప్రజల దృష్టికి ఎక్కువగా వచ్చింది. సంగీతతో దాదాపు 27 ఏళ్ల వివాహ బంధం తర్వాత విడాకుల కేసు, అనుకోని ఆరోపణలు రాజకీయ విమర్శలకు దారితీశాయి. విజయ్ కూడా తన సమీప వ్యక్తులను ఉపయోగించి తనను టార్గెట్ చేస్తున్నారని పరోక్షంగా స్పందించారు. ఇలాంటి సమయంలో సంగీతా బీజేపీ వైపు మొగ్గు చూపడం గురించిన రూమర్లు రావడం ఆసక్తికరం. ఇది విజయ్ రాజకీయ వ్యూహాలకు ఎదురుదెబ్బ కావచ్చని భావిస్తున్నారు.విజయ్ టీవీకే ద్వారా తమిళనాడులో కొత్త శక్తిగా ఎదిగాడు. అతని ప్రభావాన్ని చీల్చడానికి కుటుంబ సభ్యులను ఉపయోగించడం ఒక తెలివైన వ్యూహం కావచ్చు. అయితే ఇలాంటి రూమర్లు పబ్లిసిటీని పెంచుతాయి. సంగీతా బీజేపీలో చేరితే అది తమిళ సినిమా?రాజకీయాల మధ్య మరింత సంబంధాన్ని బలపరుస్తుంది. బీజేపీలో ఉన్న ఒక నటి ఈ ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పడం రూమర్‌కు మరింత ఆకర్షణీయతను ఇస్తోంది.ఇప్పటికి ఇది కేవలం రూమర్ మాత్రమే. సంగీత వైపు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. రాజకీయాల్లో వ్యక్తిగత సంబంధాలు తరచుగా ఉపయోగపడతాయి, కానీ అవి ఎలాంటి ఫలితాలిస్తాయో చెప్పడం కష్టం. విజయ్ అభిమానులు ఇలాంటి వార్తలను తీవ్రంగా తీసుకుంటారు, అదే సమయంలో వ్యతిరేకులు దీన్ని ఆయుధంగా మలుచుకోవచ్చు. తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ సినిమా గ్లామర్‌తో ముడిపడి ఉంటాయి కాబట్టి ఇలాంటి డెవలప్‌మెంట్లు పెద్దగా ఆశ్చర్యం కలిగించవు.ఈ రూమర్ తమిళనాడు రాజకీయాల్లో వ్యక్తిగత జీవితాలు ఎంతగా రాజకీయ సాధనాలుగా మారుతున్నాయో చూపిస్తుంది. సంగీతా బీజేపీలో చేరడం నిజమైతే అది పెద్ద ట్విస్ట్ అవుతుంది. ప్రస్తుతం ఇది కేవలం ఊహాగానాలు మాత్రమే. అధికారిక నిర్ధారణ కోసం వేచి చూడాలి. రాజకీయాలు అనేవి అనూహ్యమైనవి. ఈ డెవలప్‌మెంట్ విజయ్ రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో కాలమే చెప్పాలి.

# నెల రోజులు టీ మానేస్తే, ఊహించని విధంగా..!!

టీ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమైంది. చాలా మంది ప్రతిరోజూ ఉదయం మంచం మీద నుండి లేచిన వెంటనే టీ తాగి నిద్రలేవడం ఇష్టపడతారు. అదే సమయంలో, చాలా మంది అల్పాహారం సమయంలో కూడా టీ తాగుతారు. కొంత మంది టీకి ఎంతగా బానిసలయ్యారంటే, రోజుకు 3 నుండి 4 సార్లు టీ తాగుతారు. అయితే, ఇంతగా అలవాటు పడిన వారు 30 రోజులు టీ మానేస్తే శరీరం అద్భుతమైన రీబూట్ ప్రక్రియకు లోనవుతుంది.



ఊహించని మార్పు కనిపిస్తుంది. ఈ 30 రోజుల ఛాలెంజ్ పైన నిపుణులు ఆసక్తి కర అంశాలను వెల్లడిస్తున్నారు. టీ ప్రియులకు, ఒక నెల పాటు టీ తాగకుండా ఉండటం పెద్ద సవాలుగా ఉంటుంది. కానీ, టీ తాగాలనే కోరికను అరికట్టడం వల్ల వారి ఆరోగ్యానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు లభిస్తాయి. ఈ మార్పు బాహ్య సౌందర్యానికే కాకుండా శరీరంలోని ప్రతి కణాన్నీ పునరుజ్జీవింపజేస్తుంది. కళ్ల కింద నలుపు మాయమై, ముఖం యవ్వనంగా మారుతుంది. లోలోపల అవయవాలు కూడా మరింత చురుగ్గా పనిచేస్తాయి. రక్తప్రసరణ మెరుగుపడి, మంచి నిద్రపట్టడంతోపాటు తెలియకుండానే మనలో ఒక కొత్త ఉత్సాహం ఉరకలేస్తుంది. టీలో ఉండే కెఫీన్ మన శరీరం నుంచి నీటిని త్వరగా బయటికి పంపించేస్తుంది. దీంతో చర్మం పొడిబారినట్లు కనిపిస్తుంది. కాబట్టి టీ మానేయడం వల్ల శరీరంలో నీటి శాతం స్థిరంగా ఉండి, చర్మకణాలకు తగిన తేమ అందుతుంది. తద్వారా ముఖం, బుగ్గలు తాజాగా మెరుస్తూ ఉంటాయి. ఇక టీ మానేసి నీళ్లు, హెర్బల్ డ్రింక్స్ తాగడం వల్ల లివర్, కిడ్నీలు చురుగ్గా పనిచేసి, రక్తాన్ని సమర్థంగా శుద్ధి చేస్తాయి.టీలో సాధారణంగా కలిపే పాలు, చకెర మొటిమలకు మంచి మిత్రులు. చకెర తీసుకోవడం వల్ల ఇన్సులిన్ ఒకసారిగా పెరుగుతుంది. ఇది చర్మంలోని నూనె గ్రంథులను ప్రేరేపించి ముఖంపై ఎకువ నూనె ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయి. ఇక పాలలోని హార్మోన్లు మొటిమలను ప్రేరేపిస్తాయి. టీ మానేయడం వల్ల నూనె ఉత్పత్తి తగ్గి కొత్త మొటిమలు రావడం నెమ్మదిస్తుంది. కళ్ల కింద నలుపు రావడానికి ప్రధాన కారణం నిద్రలేమి. టీలో ఉండే కెఫీన్ నిద్రను కలిగించే మెదడులోని అడెనోసిన్‌ను అడ్డుకుంటుంది. టీ మానేయడం వల్ల శరీరం సహజమైన నిద్ర సైకిల్‌కు చేరుకుంటుంది. గాఢ నిద్ర పట్టడం వల్ల కళ్ల చుట్టూ ఉండే రక్తనాళాలు విశ్రాంతి పొందుతాయి. ఫలితంగా కళ్ల కింద డార్క్‌నెస్, కళ్ల కింద వాపు కూడా తగ్గుతుంది. అయితే ఒక్కసారిగా టీ మానేస్తే మొదటి వారం రోజులు కొంచెం ఇబ్బందిగా ఉండొచ్చు. తేలికపాటి తలనొప్పి, నీరసం, చిరాకు ఉండొచ్చు. అలాంటప్పుడు నెల రోజుల పాటు టీకి బదులుగా గోరువెచ్చని నీళ్లు, నిమ్మరసం, కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటికిపోయి సత్ఫలితాలు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# సూపర్ టేస్టీ కరివేపాకు పొడి.. ఇలా ఈజీగా చేసుకోండి..!



మనం సాధారణంగా కూరలు, పప్పు, చారు ఇలా ఏ వంట వండినా అందులో తప్పకుండా రెండు రెమ్మల కరివేపాకు వేస్తుంటాం. ఇలా వంటల్లో కరివేపాకు వేసుకోవడం వల్ల కమ్మదనం పెరుగుతుంది. అలాగే కరివేపాకులను రోజూ తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనం అని నిపుణులు చెబుతున్నారు. కరివేపాకులను తినడం వల్ల గుడ్ బ్యాక్టీరియా పెరుగుతుందని అజీర్ణం, కడుపుబ్బరం, గ్యాస్ లాంటి సమస్యలు తగ్గుతాయని సూచిస్తున్నారు. అలాగే కరివేపాకు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. మరి కరివేపాకుతో చాలామంది చట్నీ చేసుకుంటారు. ఇంకొంతమంది కరివేపాకు పొడి కూడా చేసుకుంటారు. మరి ఇంట్లోనే ఈజీగా కరివేపాకు పొడి ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ చూద్దాం..కరివేపాకు పొడి తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. కరివేపాకు ఒక పెద్ద కప్పు(శుభ్రంగా కడిగి పెట్టినవి), వెల్లుల్లి రెబ్బలు 6 నుంచి 8 పొట్టు తీసినవి, ఎండుమిర్చి 10 నుంచి 12 కారానికి తగినంత, ధనియాలు ఒక టేబుల్ స్పూన్, జీలకర్ర అర టేబుల్ స్పూన్, పల్లీలు ఒక టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి సరిపడా, ఇంగువ చిటికెడు తీసుకోవాలి. ఇక తయారీ విధానం చూస్తే.. ముందుగా కరివేపాకు ఆకులను శుభ్రంగా కడిగి, తేమ లేకుండా పూర్తిగా ఆరబెట్టుకోవాలి.ఇప్పుడు పొయ్యి మీద పెనం పెట్టుకోవాలి. అందులో జీలకర్ర, ఎండుమిర్చి, పల్లీలు, వెల్లుల్లి రెబ్బలను వేసి దోరగా వేయించుకోవాలి. ఇప్పుడు అదే పెనంలో కరివేపాకు ఆకులను వేసి అవి క్రిస్పీగా అయ్యేంత వరకూ వేయించుకోవాలి. చివరగా ఇంగువ వేసి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు వేయించిన పదార్థాలను పూర్తిగా చల్లారాక వాటిని మిక్సీ జార్ లో వేసి తగినంత ఉప్పు చేర్చి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు తయారైన కరివేపాకు పొడిని గాలి చొరబడని డబ్బాలో భద్ర పరచుకోవాలి. ఈ కరివేపాకు పొడిని వేడి వేడి అన్నంతో కలిపి తింటే సూపర్ టేస్టీగా ఉంటుంది.

# నెల్లూరు స్టైల్ 'నెత్తళ్ల పులుసు'.. ఇలా చేస్తే గిన్నె మొత్తం ఊడ్చేస్తారు..!

చేపల కూర అనగానే చాలామందికి నోరూరుతుంది. ముఖ్యంగా తీర ప్రాంతాల ప్రజలు చేపలను ఎక్కువగా తింటారు. చేపలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా చేస్తుంటారు. ఆంధ్రా స్పెషల్, నెల్లూరు స్పెషల్, తెలంగాణ స్పెషల్ ఇలా ప్రాంతాన్ని బట్టి రుచి మారిపోతూ ఉంటుంది. అయితే నెల్లూరు స్టైల్ చేపల పులుసుకు ఉన్న క్రేజే వేరు.. ఈ చేపల పులుసు చాలా టేస్టీగా ఉంటుంది. మరి నెల్లూరు స్టైల్ లో నెత్తళ్ల పులుసు ఎప్పుడైనా ట్రై చేశారా..? నెత్తళ్ల పులుసు ఇలా చేస్తే గిన్నె మొత్తం ఊడ్చేస్తారు. నెత్తళ్ల పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు.. తయారీ విధానం గురించి పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.. నెత్తళ్ల చేపల పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే ముందుగా నెత్తళ్లు చిన్నవి 500 గ్రాములు, చింతపండు పెద్ద



నిమ్మకాయ సైజంత, మామిడికాయ ముక్కలు ఒక కప్పు, ఉల్లిపాయలు రెండు ముక్కలుగా కట్ చేసుకోవాలి, టమాటోలు రెండు ముక్కలుగా కట్ చేసుకోవాలి, పచ్చిమిర్చి నాలుగు, మసాలా దినుసులు(పోపు కోసం) ఆవాలు, జీలకర్ర, మెంతులు, కరివేపాకు(కొద్దిగా) తీసుకోవాలి, అలాగే పసుపు పావు టీ స్పూన్, కారం రెండు టీ స్పూన్ లు లేదా రుచికి తగినంత, ఉప్పు రుచికి తగినంత, కొత్తిమీర గార్నిష్ కోసం తీసుకోవాలి. ఇప్పుడు నెత్తళ్ల పులుసు తయారీ విధానం చూస్తే ముందుగా ఒక గిన్నెలో నూనె వేడి చేసి పోపు దినుసులు వేసి చిటపటాలాడించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించుకోవాలి. ఇప్పుడు టమాటో ముక్కలు, పసుపు, కారం, చింతపండు రసం, ఉప్పు, మామిడికాయ ముక్కలు వేసి ఉడికించుకోవాలి. పులుసు మరిగిన తర్వాత నెత్తళ్లు చేపలు వేసి తక్కువ మంటపై ఉడికించుకుని దింపేస్తే సరి.. చివరగా కొత్తిమీర గార్నిష్ చేసుకుంటే చాలు.. సూపర్ టేస్టీ నెత్తళ్ల పులుసు రెడీ అయినట్టే..

# స్ట్రాబెర్రీ.. పోషకాలల ఖజానా





ఎంతో ఇష్టంగా తినే పండ్లలో ఒకటి.. స్ట్రాబెర్రీ. చూడగానే నోరూరించే ఈ పండ్లు రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాలలోనూ ముందుంటాయి. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి ఇందులో. ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి ఇవన్నీ. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది, జీర్ణక్రియను చురుగ్గా పనిచేస్తుంది.

చర్మానికి సహజమైన కాంతి అందుతుంది. పిల్లలు, పెద్దలు ఆస్వాదించడానికి ప్రకృతి సిద్ధమైన స్నాక్‌గా కూడా వీటిని తీసుకోవచ్చు. పచ్చిగా తిన్నా, స్మూతీలలో వాడినా, అల్పాహారంలో భాగంగా చేసుకున్నా, సాయంత్రం వేళ స్నాక్స్ గా తీసుకున్నా స్ట్రాబెర్రీలు.. శరీరానికి అవసరమైన పోషణ, కావాల్సిన ఎనర్జీని అందిస్తాయి.

**స్ట్రాబెర్రీల్లో..**

స్ట్రాబెర్రీలు తక్కువ కేలరీలను కలిగి ఉన్నప్పటికీ, కీలక పోషకాలతో సమృద్ధిగా నిండి ఉంటాయి. విటమిన్ సీ అధిక స్థాయిలో ఉంటుంది. దీనివల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. చర్మం నిగారింపును సంతరించుకు ంటుంది. అలాగే ఇవి జీర్ణక్రియకూ సహాయపడతాయి, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఎందుకంటే అవి డైటరీ ఫైబర్‌కు మంచి వనరు.అ ంతేకాదు, యాంథోసైనిన్లు, ఫ్లేవనా యిడ్లు, ఫెనోలిక్ యాసిడ్ల వంటి వివిధ ఫైటోకెమికల్స్ యాంటీఆ క్సిడెంట్లుగా, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్లుగా పని చేస్తాయి. చాలా తీపి పండ్లతో పోలిస్తే, స్ట్రాబెర్రీల్లో లోయర్ మిడిల్ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతుంది. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తీసుకోవడం గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుందని కొన్ని పరిశోధనలు సైతం సూచిస్తున్నాయి.ఈ పండ్లలోని ఫ్లేవనాయిడ్లు, యాంథోసైనిన్లు రక్తపోటును తగ్గించడం, చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం, మొత్తం రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో సంపూర్ణంగా సహాయపడతాయి.

**యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ప్రభావాలు**

స్ట్రాబెర్రీలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించగలుగుతాయి. ఫ్రీ రాడికల్స్.. కణాల వృద్ధాప్యం, కడుపులో మంట (ఇన్ఫ్లమేషన్)కు దోహదపడే అస్థిర అణువులు. స్ట్రాబెర్రీలు తీసుకోవడం వల్ల అందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఫైబర్, ఫైటోకెమికల్స్ సమృద్ధిగా ఉండటం వల్ల, స్ట్రాబెర్రీలు పేగు మైక్రోబయోమ్‌కు మద్దతు ఇస్తాయి. క్రమంగా జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. ఇవి ప్రయోజనకరమైన పేగు బాక్టీరియాకు ఆహారాన్ని అందించి జీర్ణ సౌలభ్యాన్ని పెంపొందిస్తాయి.

**చర్మ ఆరోగ్యం..**

విటమిన్ సీ కొల్లాజెన్ ఉత్పత్తిలో స్ట్రాబెర్రీ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు.. అల్ట్రా వయోలెట్ కిరణాలు, వాయు కాలుష్యం వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షించడంలో సహాయపడతాయి కూడా. స్ట్రాబెర్రీల్లోని ఫ్లేవనాయిడ్లు వయస్సు సంబంధిత జ్ఞాపక శక్తి క్షీణతను తగ్గించడం ద్వారా మెదడు ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుస్తాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, దీర్ఘకాలిక నాడీ నిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేయడానికీ సహకరిస్తాయి.

# చైనీస్ స్టైల్ "పనసకాయ మంచూరియా" ట్రై చేస్తారా..?

చైనీస్ స్టైల్ వంటకాలంటే ఇష్టపడేవారికి పనసకాయ మంచూరియా ఒక అద్భుతమైన ఎంపిక. పచ్చి పనసకాయతో తయారయ్యే ఈ వంటకం బయటకు క్రిస్పీగా, లోపల మెత్తగా ఉండి ప్రత్యేక రుచిని అందిస్తుంది. వెజిటేరియన్లకు ఇది చికెన్ మంచూరియాకు మంచి ప్రత్యామ్నాయంగా చెప్పొచ్చు. సాయంత్రం స్నాక్‌గా, పార్టీ స్టార్టర్‌గా లేదా ఫ్రైడ్ రైస్, నూడుల్స్‌తో సైడ్ డిష్‌గా సర్వ్ చేస్తే అద్భుతంగా ఉంటుంది.పచ్చి పనసకాయలో ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇందులో విటమిన్ అ, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. ఒక్కసారి ఈ పనసకాయ మంచూరియాను ట్రై చేస్తే.. రెస్టారెంట్ స్టైల్ రుచిని ఇంట్లోనే ఆస్వాదించిన ఆనందం మీ సొంతమవుతుంది. ఈ టేస్టీ రెసిపీ మీకోసం ప్రత్యేకంగా..

**కావలసిన పదార్థాలు..**

పచ్చి పనసకాయ ముక్కలు – 2 కప్పులుకార్న్‌ఫ్లోర్ – 2 టేబుల్ స్పూన్లు మైదా – 2 టేబుల్ స్పూన్లుఅల్లం–వెల్లుల్లి పేస్ట్ – 1 టీస్పూన్‌కారం – 1 టీస్పూన్‌మిరియాల పొడి – ½ టీస్పూన్‌ఉప్పు – రుచికి సరిపడానూనె – డీప్ ఫ్రైకి సరిపడానూనె – 2 టేబుల్ స్పూన్లువెల్లుల్లి – 1 టేబుల్ స్పూన్ (సన్నగా తరిగినది)అల్లం – 1 టీస్పూన్ (సన్నగా తరిగినది)పచ్చిమిర్చి – 2ఉల్లిపాయ – 1 (చదరపు ముక్కలు)క్యాప్సికం – ½ కప్పుసోయా సాస్ – 1½ టీస్పూన్లురెడ్ చిల్లీ సాస్ – 1 టీస్పూన్‌టమాటో కెచప్ – 1 టేబుల్ స్పూన్‌వెనిగర్ – ½ టీస్పూన్ (ఐచ్చికం)కార్న్‌ఫ్లోర్ – 1 టీస్పూన్‌నీరు – ½ కప్పుమిరియాల పొడి – ½ టీస్పూన్‌ఉప్పు – తగినంతఉల్లికాడలు – 2 టేబుల్ స్పూన్లునువ్వులు – కొద్దిగా (ఐచ్చికం)తయారీ విధానం..ముందుగా పచ్చి పనసకాయ ముక్కలను శుభ్రంగా కడిగి, కొద్దిగా ఉప్పు, పసుపు వేసిన నీటిలో మెత్తగా ఉడికించుకోవాలి. ఉడికిన తర్వాత నీటిని పూర్తిగా వంపేసి, ముక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవాలి.

# పల్లీ రైస్ ఇలా తయారుచేస్తే మెతుకు కూడా మిగల్చరు!

వేగంగా, రుచికరంగా లంచ్ బాక్స్ లోకి టేస్టీ, స్పైసీ మంచి పౌష్టికాహారం తినాలనుకుంటే పల్లీల అన్నం చాలా మంచి రెసిపీ. పల్లీల రైస్ ను మిగిలిన అన్నంతో సులభంగా తయారుచేయవచ్చు. ఇది చల్లారిన తర్వాత కూడా రుచిగా ఉంటుంది. చూడటానికి బాగుంటుంది, దీనికి వేరే సైడ్ డిష్ కూడా అవసరం లేదు. ఇకపల్లీల అన్నం ఎలా తయారు చేస్తారో ఒకసారి చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు:**

వేరుసెనగపప్పు: 1/4 కప్పు నువ్వులు: 1/4 కప్పు ఎండు మిర్చి: 4 పచ్చి కొబ్బరి (తురిమినది): 1/4 కప్పుఉడికించిన అన్నం: 1 కప్పు ఉప్పు: తగినంత నూనె: 1/4 కప్పు ఆవాలు: 1/2 టీస్పూన్‌మినపప్పు: 1 టీస్పూన్‌శెనగపప్పు: 1 టీస్పూన్‌కరివేపాకు: 2 రెమ్మలు

**తయారీ విధానం**

ముందుగా స్టవ్ వెలిగించి ఒక పాన్ పెట్టి, పాన్ లో పావు కప్పు వేరు శనగపప్పు, పావు కప్పు నువ్వులు, నాలుగు ఎండు మిర్చి వేసి సిమ్ లో పెట్టి దోరగా వేయించుకోవాలి. తరువాత అదే పాన్ లో తురుముకున్న పచ్చి కొబ్బరి కూడా వేసి వేయించుకోవాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని కాస్త పలుకుగా గ్రైండ్ చేసుకోవాలి.ఇలా చేస్తే పల్లీల రైస్ సూపర్ఆపై అదే పాన్ లో నూనె వేసుకుని తాలింపు గింజలు వేసి పోపు చేసుకోవాలి. ఈ పోపులో కరివేపాకు కూడా వేసుకోవాలి ఆపై అందులో అన్నం వేసి, మిక్సీ చేసి పెట్టుకున్న పొడిని, రుచికి సరిపడా ఉప్పును వేసి బాగా కలుపుకోవాలి. ఆపై స్టవ్ ఆఫ్



చేసి సర్వ్ చేసుకోవటమే. ఇది లంచ్ బాక్సులోకి చాలా బాగుంటుందిటేస్టీ, హెల్దీ పుదీనా రైస్.. ఇలా చేస్తే మొత్తం ఖాళీ చేస్తారు!టేస్టీ, హెల్దీ పుదీనా రైస్.. ఇలా చేస్తే మొత్తం ఖాళీ చేస్తారు!ఈ టిప్స్ పాటిస్తే టేస్టీ పల్లీల రైస్పల్లీల అన్నం అద్భుతమైన రుచిని పొందాలంటే కొన్ని చిట్కాలు ముఖ్యం. తాలింపులోని పప్పు దినుసులు, వేరుసెనగపప్పును సన్నని సెగపై నెమ్మదిగా, ఎర్రగా, కరకరలాడే వరకు వేయించాలి. ఇలా లోపలి వరకు వేగితేనే అన్నానికి మంచి రుచి వస్తుంది. ముఖ్యంగా, ఎండాకాలంలో పచ్చి కొబ్బరిని నేరుగా అన్నంలో కలిపితే త్వరగా పాడవుతుంది. రుచి తగ్గకుండా, అన్నం చెడిపోకుండా ఉండాలంటే, పచ్చి కొబ్బరిని తాలింపులో వేసి వేయించడం ఉత్తమం.

## స్పోర్ట్స్ న్యూస్

# వెస్టిండీస్ జట్టుకు ఊహించని షాకిచ్చిన ఐర్లాండ్



వెస్టిండీస్ మహిళల జట్టుకు ఐర్లాండ్ ఊహించని షాకిచ్చింది. ట్రై సిరీస్‌లో భాగంగా డబ్లిన్ వేదికగా జరిగిన విండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో ఒక్క పరుగు తేడాతో ఐర్లాండ్ విజయం సాధించింది. మహిళల టీ20ల్లో వెస్టిండీస్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ విజయంతో ఐర్లాండ్ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఐర్లాండ్ కెప్టెన్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్ బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ అదరగొట్టి తన జట్టు గెలుపులో కీలక పాత్రపోషించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్(1), టేలర్(9),డాటిన్(16) వంటి సీనియర్ ప్లేయర్లు విఫలమయ్యారు. 43 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న విండీస్ జట్టును షెమైన కాంప్‌బెల్ ఆదుకుంది. ఆఖరిలో గ్లాస్కో(36) కాస్త దూకుడుగా ఆడడంతో విండీస్‌కు కాస్త గౌరవప్రదమైన స్కోర్ దక్కింది. అనంతరం 142 పరుగుల టార్గెట్ తో ఐర్లాండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఐర్లాండ్ స్కోర్ 14.1 ఓవర్లలో 95/5 వద్ద ఉండగా ఆటకు వర్షం అంతరాయం కలిగించింది. అయితే ఆ సమయానికి డక్ వర్త్ లూయిస్ ప్రకారం ఐర్లాండ్ 3 పరుగులు వెనుకబడి ఉంది. అంపైర్లు మ్యాచ్‌ను ఆపేసే ముందు కనీసం ఒక్క బంతి అయినా వేయాలని ఐర్లాండ్ బ్యాటర్లు పట్టుబట్టారు జాజారా క్లాక్స్టన్ వేసిన బంతి లూయిస్ లిటిల్ ఫోర్ కొట్టాడు. వర్షం తీవ్రత పెరగడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. అప్పటికి డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఐర్లాండ్ 1 పరుగు ఆధిక్యంలో ఉండటంతో ఐర్లాండ్ జట్టును విజేతగా ప్రకటించారు. ఓర్లా ప్రెండర్‌గాస్ట్(46 బంతుల్లో 71 పరుగులు) అజేయంగా నిలిచింది. ఈ ట్రై సిరీస్ లో పాకిస్థాన్, ఐర్లాండ్, వెస్టిండీస్ మహిళల జట్టు పాల్గొన్నాయి. ఇప్పటికీ రెండు మ్యాచులు ఓడి.. పాయింట్ల పట్టికలో పాకిస్థాన్ చివరి స్థానంలో ఉంది. ఐర్లాండ్, విండీస్ జట్లకు సమానంగా నాలుగు పాయింట్లు ఉన్నప్పటికీ నెట్ రన్ రేట్ ప్రకారం వెస్టిండీస్ టాప్ ప్లేసులో ఉంది. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఈ మూడు జట్టులో మిగిలిన జట్లతో రెండేసి మ్యాచులు ఆడాల్సి ఉంటుంది.

# చిన్న పిల్లాడిలా మారి.. డ్యాన్స్ చేసిన విరాట్!



ఐపీఎల్ 2026 టైటిల్ గెలిచిన తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు, వారి అభిమానుల సంబరాలు ఏమాత్రం తగ్గడం లేదు. 17 ఏళ్ల తర్వాత గతేడాది తొలిసారి ఐపీఎల్ కప్పు సాధించడం, అదే ఊపుతూ వరుసగా రెండో సారి కూడా ట్రోఫీని ముద్దాడింది. దీంతో ఆర్సీబీ స్టార్ విరాట్ కోహ్లీతో సహా మిగిలిన సభ్యులందరూ సంబరాల్లో మునిగి తేలుతున్నారు. కింగ్ కోహ్లీ అయితే ట్రోఫీ అందుకునే సమయంలో చేసిన సందడి అంతాఇంతా కాదు. తాను సీనియర్ ప్లేయర్‌ను అనే సంగతి మర్చి మరీ.. చిన్న పిల్లాడిలా మారిపోయాడు. తనలో ఎవ్వరూ డ్యాన్స్ ఆవహించినట్లుగా విరాట్ అదరగొట్టాడు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక వీడియోను కూడా పంచుకున్నాడు. అందులో తన సహచరుడు భువనేశ్వర్ కుమార్‌తో కలిసి విరాట్ డ్యాన్స్ చేస్తూ కనిపించాడు . జట్టు విజయోత్సవ వేడుకలో తీసిన ఈ క్లిప్‌లో ఆ ఇద్దరూ ఫ్లోర్‌పై 'కిక్లి' స్టెప్ వేస్తూ కనిపించారు. కిక్లి అనేది పంజాబ్‌కు చెందిన ఓ జానపద నృత్యం. ఈ డ్యాన్స్‌ను భువీ, విరాట్ వేస్తూ.. సహచరులను ఎంటర్ టైన్ చేశారు. ఈ వీడియోను చూసిన అభిమానులు సైతం తెగ సంబరపడుతున్నారు.క్రికెట్ దిగ్గజమైన కోహ్లీ.. ఇలా చిన్న పిల్లాడిలా మారి.. సంబరాల్లో మునిగి తేలడం.. అతడి అభిమానులతో పాటు క్రికెట్ ప్రియులు ఆశ్చర్యానికి గురయ్యారు. అయితే ఇలా కోహ్లీ డ్యాన్స్ చేయడం ఇది మొదటిసారి కాదు. రెండు రోజుల క్రితం తన భార్య అనుష్క శర్మతో కలిసి కూడా విరాట్ డ్యాన్స్ చేస్తూ కనిపించాడు. మరోవైపు ఆర్సీబీ రెండవ ఐపీఎల్ టైటిల్ గెలవడంలో కోహ్లీ చేసిన అజేయ 75 పరుగులు కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో అతడు అద్భుత ప్రదర్శన చేయడం, తన జట్టు ఏకంగా ట్రోఫీని ముద్దాడటం పట్ల విరాట్ ఎంతో సంతోషంగా ఉన్నాడు.

# టీమిండియాలోకి వైభవ్ ఎంపికపై హడావిడి వద్దు: సంజయ్ మంజ్రేకర్

ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో భారత క్రికెట్‌లో హాట్ టాపిక్‌గా మారాడు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఈ సీజన్‌లో 776 పరుగులు చేసి.. ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. పలు అరుదైన రికార్డులు కొల్లగొట్టాడు. అతడిని వెంటనే టీమిండియాలోకి తీసుకోవాలంటూ డిమాండ్లు వినిపిస్తున్న వేళ.. భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తొందరపడి వైభవ్ సూర్యవంశీని జాతీయ జట్టులోకి



తీసుకురావద్దని తెలిపాడు. 'సంజు శాంసన్, అభిషేక్ శర్మ తర్వాతి వరుసలో వైభవ్ సూర్యవంశీ ఉంటాడు. అయితే అతడిని నేరుగా న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి విదేశీ పర్యటనలకు పంపడం సరైన నిర్ణయం కాకపోవచ్చు. ముందుగా ఐపీఎల్ తరహా బ్యాటింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో వైభవ్‌ను పరీక్షించాలి. అయితే అతడికి ఐపీఎల్ ఫామ్‌ను విదేశాల్లోనూ కొనసాగించే సామర్థ్యం ఉంది. కానీ వైభవ్‌పై అతిగా అంచనాలు పెట్టుకుని విదేశీ పర్యటనలకు ఎంపిక చేయడం సరికాదు. వైభవ్ టీమిండియాలో ఎలా రాణిస్తాడు? ఒత్తిడిని తట్టుకుంటాడా? వంటి ప్రశ్నలు కూడా వేస్తున్నారు. కానీ అది మన పని కాదు. నిజానికి అది బీసీసీఐ పని కూడా కాదు. వైభవ్ ఒక వ్యక్తి.. అతడి చుట్టూ కోచ్‌లు, మార్గదర్శకులు ఉంటారు. జీవితంలో అతడు ఏం సాధించాలని అనుకుంటున్నాడో అతడే నిర్ణయించుకోవాలి' అని సంజయ్ మంజ్రేకర్ తెలిపాడు. 'వైభవ్ కేవలం టీ20 ఫార్మాట్ స్పెషలిస్ట్‌గా మారాలనుకుంటే అలాగే ఉండొచ్చు. అందులో తప్పేమీ లేదు. కానీ అప్పటి నుంచి అతడిని టీ20 ప్లేయర్‌గానే అంచనా వేస్తారు. వన్డే క్రికెట్‌లో వైభవ్ ఆడితే.. తొలి 10 ఓవర్లలో అతడు చేసే విధ్వంసానికి అవధులు ఉండవు. గేమ్‌ను వన్ సైడ్ మార్చేసే సత్తా అతడిలో ఉంది. రంజీ ట్రోఫీ ఆడాలనుకుంటే వైభవ్ కూడా జట్టులో తన స్థానం కోసం పోటీ పడాలి. ఐపీఎల్ ప్రదర్శనల ఆధారంగా వెంటనే అవకాశాలు ఇవ్వడం కొంతమంది అర్హులైన ఆటగాళ్లకు అన్యాయం చేసినట్టు అవుతుంది. బిహార్ క్రికెట్ అకాడమీ తరఫున ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న ఆటగాళ్లు ఉన్నారు. కాబట్టి వైభవ్‌పై అనవసర ఒత్తిడి పెట్టకుండా.. అతడు ఏ దిశలో వెళ్లాలనుకుంటున్నాడో అతడే నిర్ణయించుకునేలా వదిలేయాలి' అని మంజ్రేకర్ సూచించాడు.

# డోపింగ్ వలలో రన్నర్ కేఎం దీక్ష.. కామన్‌వెల్త్ గేమ్స్‌కు డౌటే



న్యూఢిల్లీ: కామన్‌వెల్త్ క్రీడలకు ముందే భారత్ భారీ జలక్ తగిలింది. మిడిల్ డిస్టెన్స్ రన్నర్ కేఎం దీక్ష( డోపింగ్ వలలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. 1500 మీటర్ల ఈవెంట్‌లో దీక్ష జాతీయ రికార్డు హోల్డర్. అయితే ఆమె శ్యాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతానికి ఆమెపై ఎటువంటి సస్పెన్షన్ విధించలేదు. కానీ కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆమె అర్హత సాధించేది డౌట్‌గా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. మే చివరి వారంలో దీక్షకు ఓ లేఖను అందజేసినట్లు కూడా కొన్ని వర్గాల ద్వారా తెలిసింది.రన్నర్ దీక్ష శ్యాంపిల్‌లో స్టానోజోలోల్ అనే పదార్థాం ఉన్నట్లు భావిస్తున్నారు. ప్రపంచ డోపింగ్ సంస్థ వాడా ఆ పదార్థాన్ని బ్యాన్ చేసింది. అనబాలిక్ ఏజెంట్ల లిస్టులో ఆ పదార్థం ఉంది. ఒకవేళ దీక్ష ఆ ఉత్ప్రేరకాన్ని తీసుకున్నట్లు రుజువైతే, ఆమెకు నాలుగేళ్ల వేటు పడే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది లాస్ ఏంజిల్స్‌లో జరిగిన సౌండ్ రన్నింగ్ ట్రాక్ ఫెస్ట్ ఈవెంట్‌లో ఆమె కొత్త జాతీయ రికార్డును స్థాపించింది. 4:04.78 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని మూడవ స్థానంలో నిలిచింది. 2026 ఏప్రిల్ 5వ తేదీన జైపూర్‌లో జరిగిన ఇండియన్ అథ్లెటిక్స్ సిరీస్2లో గోల్డ్ మెడల్ గెలిచిన తర్వాత దీక్ష మళ్లీ ఎటువంటి టోర్నీల్లో ఆడలేదు.భోపాల్‌లోని మధ్యప్రదేశ్ అథ్లెటిక్స్ అకాడమీలో ఎస్కే ప్రసాద్ వద్ద ఆమె శిక్షణ పొందుతోంది. అయితే గత నెలలోనే ఆ శిక్షణా కేంద్రం నుంచి దీక్ష వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. బ్యాన్ చేసిన ఉత్ప్రేరకం వాడినట్లు వస్తున్న వార్తలపై స్పందించేందుకు దీక్ష కోచ్ నిరాకరించారు.


# ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించిన విరుష్కా జంట



న్యూఢిల్లీ: విరుష్కా జంట.. వృందావనంలోని ప్రేమానంద్ మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఐపీఎల్ టైటిల్ గెలిచిన తర్వాత ఆర్సీబీ బ్యాటర్ కోహ్లీ తన భార్య అనుష్కా శర్మతో కలిసి ఆధ్యాత్మిక ఆశ్రమాన్ని విజిట్ చేశారు. ప్రేమానంద్ మహారాజ్‌కు చెందిన రాధా కేళీ కుంజ్ ఆశ్రమానికి వెళ్లారు. కోహ్లీ, అనుష్కా దంపతులు ఇప్పటికే అనేక సార్లు ఆశ్రమాన్ని విజిట్ చేశారు. ఆశ్రమానికి వెళ్లి బయటకు వస్తున్న కోహ్లీ విజువల్స్ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది. చాలా సింపుల్ డ్రెస్సుల్లో ఇద్దరూ ఆశ్రమానికి వెళ్లారు. మాస్క్‌లతో తమ ముఖాన్ని కవర్ చేసుకున్నారు. ప్రేమానంద్ ఆధ్యాత్మిక బోధనలు వినేందుకు తరుచూ అనుష్క, కోహ్లీ జంట ఆశ్రమానికి వెళు ంటారు. గత ఆదివారం జరిగిన ఐపీఎల్ ఫైనల్లో గుజరాత్‌పై ఆర్సీబీ విజయం సాధించింది. అయితే ట్రోఫీ పట్టుకున్న సమయంలో కోహ్లీ నుదురుపై అనుష్కా కిస్ ఇచ్చింది.ఆ తర్వాత జరిగిన ఓ ఈవెంట్‌లో విరుష్కా జంట డ్యాన్స్ చేసింది.

# 44 ఏళ్ల వయసులో.. మళ్లీ యాక్షన్‌లోకి సెరీనా విలియమ్స్

న్యూయార్క్: మహిళ టెన్నిస్‌లో దిగ్గజ క్రీడాకారిణి సెరీనా విలియమ్స్‌మళ్లీ రాకెట్ పట్టనున్నది. దాదాపు నాలుగేళ్ల పాటు ప్రొఫెషనల్ ఆటకు దూరంగా ఉన్న ఆమె.. త్వరలో ప్రారంభంకానున్న క్వీన్స్ క్లబ్ టోర్నీలో ఆడనున్నది. మహిళల డబుల్స్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఆమె వైల్డ్ కార్డు పొందింది. జూన్ 8వ తేదీ నుంచి ఆ పోటీ ప్రారంభంకానున్నది. కెనడా యువ ప్లేయర్ విక్టోరియా మొబోకో తో ఆమె జతకట్టనున్నది. 2022 నుంచి సెరీనా టెన్నిస్‌కు దూరంగా ఉంది. తన 27 ఏళ్ల కెరీర్‌లో సెరీనా ఇప్పటి వరకు 23 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు గెలుచుకున్నది. సెరీనా మళ్లీ రాకెట్ పట్టబోతున్నట్లు గత ఏడాది నుంచే రూమర్స్ వచ్చాయి. డ్రగ్ టెస్టింగ్ పూల్‌కు ప్లేయర్లను రిజిస్టర్ చేసిన లిస్టులో సెరీనా పేరు ఉండడంతో ఆ అనుమానాలు వ్యాప్తి అయ్యాయి. అయితే తాజాగా సోమవారం సెరీనా తన సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్టు చేసింది. తన తదుపరి జర్నీ ప్రారంభించేందుకు క్వీన్స్ క్లబ్ పర్ఫెక్ట్ ప్లేస్ అని ఆలోచిస్తున్నట్లు విలియమ్స్ పేర్కొన్నది. 2022లో చివరిసారి యూఎస్ ఓపెన్ ఆడిన ఆమె ఇప్పుడు మళ్లీ రాకెట్‌తో ప్రాక్టీస్ మొదలుపెట్టింది. అయితే వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లో కూడా సెరీనా విలియమ్స్ పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



# సినిమా

## ట్రాన్స్జెండర్ జీవితాల మీద తీసిన కోర్ట్ డ్రామా " ఎల్ జి బి టీ - ఏ లీగల్ బ్యాటిల్ " మూవీ





సామాజిక ఇతివృత్తాల నేపథ్యం లో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిల్మ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా ట్రాన్స్జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా " ఎల్ జి బీ టీ - ఏ లీగల్ బ్యాటిల్ " ఈ నెల 19విష్ట న దేశవ్యాప్తంగా విడుదల కానుంది.

ప్రైడ్ మంత్ సందర్భంగా జూన్ నెలలో ఈ చిత్రాన్ని విడుదల చెయ్యదలచామని, ఎల్ బి శ్రీరామ్ , ఎస్తర్ నార్నోన్హ , రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్ లాంటి ప్రముఖ నటీనటులతో పాటు చాలా మంది రియల్ ట్రాన్స్జెండర్ యాక్టర్స్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారని హిమ రాథోడ్ హీరోయిన్ గా , చంద్రముఖి , లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణితితో నటించారని, దర్శకుడు చిత్ర టీజర్ విడుదల సందర్భంగా తెలియచేసారు.

తమ జీవితాలని హృద్యంగా మలిచారని , ఈ చిత్రం ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందన్న ఆశాభావం చిత్రం లో నటించిన నటీనటులు వ్యక్తపరిచారు.

## దర్శకుడు సందీప్ రెడ్డి సమర్పణలో రోమాంచకం



అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధి న ఫస్ట్ లుక్ పోస్టర్ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## కరిష్మాకపూర్ తాజా వెబ్ సిరీస్ బ్రౌన్


బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే పక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ఎ÷-లాట్ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.



## వారణాసి స్టిల్స్ లీక్..జక్కన్న మౌనం




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్లో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది.ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి




గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు.

## చిన్న నిర్మాతలను పట్టించుకోవడం లేదు

### నిర్మాత ధీరజ్ మొగిలినేని ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్లో ఇటీవల నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య కొనసాగుతున్న 'పర్సంటేజ్ విధానం' వివాదం పెద్ద చర్చగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు స్టార్ నిర్మాతలు కలిసి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ను రాజమండ్రిలో కలవడం ఇండస్ట్రీలో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ భేటీపై ఇప్పుడు నిర్మాత ధీరజ్ మొగిలినేని ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్గా మారింది. ఇటీవల మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నాగవంశీ, ఫైన్ స్క్రీన్స్ సాహు గారపాటి, వృద్ధి సినిమాస్ వెంకట్ సతీశ్ కిలారు, ఎస్ఎల్వీ సినిమాస్ చెరుకూరి సుధాకర్ తదితర ప్రముఖ నిర్మాతలు పవన్ కళ్యాణ్తో సమావేశమయ్యారు. చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, ముఖ్యంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో 'పర్సంటేజ్ విధానం' అంశంపై చర్చించినట్లు సమాచారం.యితే ఈ భేటీలో చిన్న, మీడియం రేంజ్ నిర్మాతలకు ప్రాతినిధ్యం లభించలేదని నిర్మాత ధీరజ్ మొగిలినేని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్లో జరిగిన 'సమ్మర్ హాలిడేస్' సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ విషయంపై స్పందించారు.'మాకు కూడా చాలా సమస్యలు ఉన్నాయి. రూ.100 కోట్లకు పైగా బడ్జెట్తో సినిమాలు తీసే పెద్ద నిర్మాతల సమస్యలు వేరు. చిన్న, మీడియం రేంజ్ సినిమాలు నిర్మించే నిర్మాతల సమస్యలు మరోలా ఉంటాయి. పవన్ కళ్యాణ్ గారిని కలిసేందుకు వెళ్లినప్పుడు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మమ్మల్ని ఎవర్నీ పిలవలేదు. కేవలం వాళ్లే వెళ్లారు' అంటూ ధీరజ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన అభిప్రాయాన్ని వివరించేందుకు ఆయన ఆసక్తికర ఉదాహరణ కూడా చెప్పారు. 'జూబ్లీహిల్స్లో 1000 గజాల ప్లాట్లో రూ.10 కోట్లతో ఇల్లు కట్టుకునేవారి సమస్యలు ఒకలా ఉంటాయి. మణికొండలో 250 గజాల ప్లాట్లో ఇల్లు కట్టుకునేవాడి సమస్యలు మరోలా ఉంటాయి. ఇద్దరూ ఇళ్లే కడుతున్నారు కానీ పరిస్థితులు, అవసరాలు వేరు. అలానే పెద్ద సినిమాలు తీసేవారి సమస్యలు వేరు.. చిన్న నిర్మాతల సమస్యలు వేరు' అని వ్యాఖ్యానించారు. ఇక ప్రస్తుతం జరుగుతున్న పర్సంటేజ్ వివాదంలో చిన్న నిర్మాతల ఇబ్బందులను ఎవరూ సరిగా అర్థం చేసుకోవడం లేదని ధీరజ్ అన్నారు. త్వరలోనే చిన్న, మీడియం రేంజ్ నిర్మాతలంతా కలిసి పవన్ కళ్యాణ్ను కలసి తమ సమస్యలను వివరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పైరసీ సమస్యపై కూడా ఆయన స్పందించారు. సినీ పరిశ్రమకు పైరసీ పెద్ద ముప్పుగా మారిందని, దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా మాట్లాడేందుకు పవన్ కళ్యాణ్ సహకారం తీసుకుంటామని వెల్లడించారు.



## రికార్డులు తిరగరాస్తున్న కరుప్పు

### 300 కోట్ల వసూళ్లను దాటిన మూవీ

తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి




Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com